ప్రజాశక్తి

Vol. 2, no. 91

(Apr. 6, 1947)

బెజవాడ, 1947

Record no. 683

Prajāśakti

Vol. 2, no. 91

(Apr. 6, 1947)

Bejavāḍa, 1947

Record no. 683

Regd. No. 4486
12 పేజీలు 3 అణాలు

ప్రజాశక్తి

కమ్యూనిస్టు దిన పత్రిక

సంపుటి 2] బెజవాడ 6-4-47 ఆదివారం [సంచిక 91

రేవారివద్ద 15 గ్రామాలు ధ్వంసం

లాహోర్, ఏప్రియల్ 4

మతకలహాలు తీవ్రంగా చెలరేగి రేవారీ ప్రాంతంలో (ఢిల్లీ రాష్ట్రప్రాంతంలోనిది) 15 గ్రామాలు పూర్తిగా ధ్వంసమైనాయనీ, ప్రాణాలు, ఆస్తులు సర్వనాశనం అయినాయనీ తెలుస్తున్నది. పరిస్థితులింకా చల్లారలేదనీ, వెంటనే మిలటరీ సహాయం అవసరమనీ రేవారీ కాంగ్రెసు కమిటీ కార్యదర్శి రాష్ట్ర కాంగ్రెస్ కమిటీకి తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్, గవర్నరును కోరింది.

జిన్నా-వైస్రాయి సమావేశం

సంప్రదింపులలో ప్రథమదశ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5

శనివారం ఉదయం 11 గంటలకు లీగు అధ్యక్షుడు జనాబ్ జిన్నా వైస్రాయిని కలుసుకున్నాడు. జిన్నా వైస్రాయి సమావేశం దాదాపు రెండుగంటలసేపు జరిగింది.

సంభాషణలింకా ప్రథమదశలో ఉన్నట్లు తెలుస్తున్నది. మరికొన్నిసారులు వైస్రాయి జనాబ్ జిన్నాను కలుసుకుంటారు. సంప్రతింపులతర్వాత జిన్నా బయటకురాగానే, "ప్రతి రోజూ మిమ్ముల్ను కలుసుకోవాలని అనుకుంటున్నాను" అని వైస్రాయి అనగా "పూర్తిగా నేను మీచేతులలో ఉన్నాను" అని జిన్నా సమాధానమిచ్చాడు.

ఆదివారంరాత్రి జిన్నా తన కుమార్తెతోపాటు వైస్రాయితో విందులో పాల్గొంటాడు.

వైస్రాయిని చూచేముందు లీగు అధ్యక్షునితో తాత్కాలికప్రభుత్వంలోని లీగుసభ్యులు సంప్రతించారు.

గాంధీజీ వైస్రాయిని నిన్న కలుసుకొని రెండుగంటలసేపు సంభాషించారు.

షారీర్-వైస్రాయి సమావేశం

ఇండొనీషియా ప్రధాని డాక్టర్ షారీర్, పండిత నెహ్రూ, ఇందిరాగాంధీ ఈ రోజు రాత్రి వైస్రాయి విందులో పాల్గొంటారు.

షారీర్-గాంధీ సమావేశం

డాక్టర్ షారీర్ ఈరోజు మధ్యాహ్నం గాంధీజీతో సంప్రతించారు. నెహ్రూ, ఖాన్ అబ్దుల్‌గఫూర్‌ఖాన్‌గారలు కూడ ఆసంప్రతింపుల్లో పాల్గొన్నారు.

గాంధీజీని తాను రౌండ్‌టేబిలు సమావేశమప్పుడు ఒకసారి చూచాననీ, తానప్పుడు విద్యార్థిగా ఉంటిననీ షారీర్ విలేఖరులకు తెలియజేశాడు. ఈ సమావేశం రాజకీయమైనదికాదని ఆయన చెప్పాడు.

ప్రజారక్షణచట్టం రద్దుచేసి అరెస్టయినవారిని విడువకుంటే రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల సమ్మె

మద్రాసురాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు తీర్మానం

మద్రాస్, ఏప్రియల్ 4

నిన్నటి సాయంకాలం మద్రాస్ రాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ సమావేశంలో మద్రాసు ప్రజారక్షణచట్టాన్ని వెంటనే రద్దుచేసి, డిటెన్యూలందరనూ విడిచిపెట్టకపోతే రాష్ట్రవ్యాప్తమైన కార్మికసమ్మె జరుపుతామని తీర్మానించారు.

మరొక తీర్మానంలో అంథొనీపిళ్లై (బకింగ్‌హామ్ మిల్లుకార్మికుల నాయకుడు)ను అరెస్టు చేయడాన్ని నిరసించారు.

రాయబారకమిటీ

చక్కరయ్యచెట్టియార్, రామామణం, సి. ఆర్. కె. శర్మ మొదలగు 16 మందితో ఒక వుపసంఘాన్ని నియమించారు. ప్రభుత్వాన్నీ, మద్రాసు లేబర్‌యూనియన్ కార్యవర్గాన్నీ కలుసుకొని, బకింగ్‌హాం మిల్లు సమ్మెను త్వరలో అనుకూలంగా పరిష్కరించడం ఈకమిటీకి వొప్పచెప్పారు.

బకింగ్‌హాం మిల్లుసమ్మె

మద్రాసు లేబర్‌యూనియన్ ఉపాధ్యక్షులు వీరస్వామిగారి అధ్యక్షతను పెరంబూర్ బారక్సువద్ద బకింగ్‌హాం మిల్లుకార్మికుల సమావేశం జరిగింది. టి. వి. కళ్యాణసుందర మొదలియార్‌గారు ఆర్. డిసిల్వా (వీలోన్) అంథొనీపిళ్లై విడుదలకోరుతూ ఉపన్యసించారు.

మద్రాస్ మేయర్ రాయబారం

మార్చి 28 న జరిగిన కార్పొరేషన్ కౌన్సిలర్ల సభలో నిర్ణయించబడిన ప్రకారం మద్రాస్ మేయరు టి. సుందరరావునాయుడు కార్మికమంత్రి రాజన్‌ను నిన్న కలుసుకొన్నారు. బకింగ్‌హాం మిల్లుసమ్మె పరిష్కారాన్నిగూర్చి మాట్లాడారు.

ఆంధ్రరాష్ట్ర సమస్యపై

ఆంధ్రులంతా ఏకముకావాలి

మద్రాస్, ఏప్రిల్ 4

నేడు మద్రాసులో తియ్యారు కుమారరాజాగారి అధ్యక్షతను ఆంధ్రమహాసభ ప్రత్యేక సమావేశం జరిగింది. ఆ సభలో అధ్యక్షులు ఈ విధంగా ఉపన్యసించారు:

మనం ఎంతో కాలం నుండి రాష్ట్ర ప్రత్యేకతకు ఆందోళన చేస్తున్నా సాధించలేకపోయాం. ప్రకాశంపంతులుగారిమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. చివరకు ఆయన ప్రధాని కాకుండా పోయారు. ఇప్పుడు బి. యన్. రావుగారు ఒక సూచన చేస్తున్నారు. దానివలన తెలుగువాళ్ళకు మరికొన్ని వుద్యోగాలూ, మంత్రాంగాలూ లభిస్తవేమోగాని, అసలు ఆంధ్రరాష్ట్రం లభించవలసిన లభించదు. రాజ్యాంగ సభలో 'ఏ' గ్రూపు రాజ్యాంగాన్ని నిర్ణయించేటప్పుడు ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి సన్నాహం చేయడం అవసరం. రాష్ట్ర నిర్మాణ విషయంలో ఆంధ్రులలోని రాజకీయాభిప్రాయభేదాలు అడ్డం రాకూడదు, ఆంధ్రులు ఏకీభావంతో ఆందోళన చేయవలసిన సమయం వచ్చింది.

చల్లపల్లిలో అరెస్టులు

చల్లపల్లి, ఏప్రియల్ 3

వాడెళ్ళవారిపాలెం గ్రామస్తులు కామ్రేడ్ కంఠంనేని రాజబాబయ్యగారిని ఏ కారణం చెప్పకుండానే పోలీసులు చల్లపల్లిలో అరెస్టు చేశారు. వీరిని డిటెన్యూగా తీసుకుపెడతారని తెలుస్తోంది.

పెదప్రోలు చెరువులను అక్రమించుకోడానికి చల్లపల్లి జమీందారు చేస్తున్న ప్రయత్నాల ఫలితంగా ఇదివరకు జరిగిన అరెస్టులుకాక తిరిగి కామ్రేడ్ దావ ఉమామహేశ్వరరావు, శ్రీ అది వెంకటస్వామి, శ్రీ సుందర వెంకట్రామయ్యగార్లను అరెస్టుచేశారు.

ఐక్యకృషి, పరస్పర సహాయం

బెంగాల్ విభజనకు రాష్ట్ర కాంగ్రెస్ తీర్మానం

కొన్ని జిల్లాలను అస్సాంతో కలపాలట

కలకత్తా, ఏప్రిల్ 4

నేడు బెంగాల్ రాష్ట్ర కాంగ్రెసు కమిటీ సమావేశమై బెంగాల్ విభజన కోరుతూ తీర్మానించింది.

"నేడు బెంగాలులో వున్నది ఒక మతసంస్థయొక్క ప్రభుత్వం. బ్రిటిష్‌ప్రభుత్వం వెళ్ళిపోయే ముందు అధికారం వారికి వప్పచెప్పకూడదు. కేంద్రతో కలిసి వుండాలనుకొనే బెంగాల్ భాగాన్ని విడదీసి వారిని కేంద్రంతో కలియనివ్వాలి."

ఒకవేళ ప్రస్తుత మంత్రివర్గంకూడా కేంద్రాధికారంలోవుండాలనుకున్నా ఈ 3 షరతులు నెరవేర్చకపోతే విభజన జరపవలసిందే నన్నారు. షరతులివి. (1) బెంగాల్ ఎన్నికలవిధానం సంయుక్త నియోజక వర్గాల పద్ధతికి మార్చాలి. (2) వయోజనులందరకూ వోటు హక్కు వుండాలి. (3) అల్పసంఖ్యాకులకు రాజ్యాంగంలో రక్షణ వుండాలి.

అంతిమాధికారం వొప్పచెప్పేలోపున బెంగాల్‌లో రెండుప్రాంతాలు రెండు మంత్రివర్గాల ఆధీనంలో పాలన జరగాలని కూడా కమిటీ అభిప్రాయం తెల్పింది.

తూర్పు బెంగాల్‌లోనూ, తూర్పు-దక్షిణ (ఆగ్నేయ) బెంగాల్‌లోనూ వున్న కొన్ని ప్రాంతాలు-గారో పర్వతప్రాంతం, చిట్టగాంగ్ ప్రాంతం మొదలయినవి కేంద్ర యూనియన్‌లో వుండడానికే అభిప్రాయపడుతున్నాయనీ, వారికాసౌకర్యం కలిగించేటందుకై అవసరమైతే వారి ప్రత్యేకంగా వేరుపడి కేంద్రంతో చేరదలచిన మరేరాష్ట్రంతోనైనా కలపవలసిందనీ కమిటీ వేరొక తీర్మానం చేసింది.

కేంద్ర శాసనసభలోని బెంగాలీ హిందూ సభ్యుల ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4

కేంద్ర శాసనసభలో బెంగాల్‌నుండి ఎన్నుకోబడిన హిందూ సభ్యుల తరపున శ్రీయుత లక్ష్మీకాంత మైత్ర ఒక ప్రకటనను స్వయంగా వైస్రాయి, గాంధీజీ, కృపలానీ, నెహ్రూ, తదితర తాత్కాలిక ప్రభుత్వ సభ్యులకు, కాంగ్రెసు కార్యవర్గ సభ్యులకు అందజేశారు. బెంగాలును కేంద్ర యూనియన్ స్వాధీనంలో స్వతంత్ర రాష్ట్రంగా చేయాలని కోరారు. మధ్యకాలంలో రెండు మంత్రివర్గాల ఆధీనంలో రెండు ప్రాంతీయ పాలనలు నెలకొల్పాలనీ, రెంటికీ గవర్నరు ఒకరే వుంటాడనీ ప్రకటన కోరుతూంది.

ఇండొనీషియా యువజన ప్రతినిధులకు స్వాగత మివ్వండి

విద్యార్థి సంఘాలకు హెచ్చరిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4

ఇండొనీషియానుండి వచ్చిన యువజన ప్రతినిధులు 7 గురు భారతదేశ పర్యటనం చేసేటందుకై అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ యొక్క ఆహ్వానంమీద ఢిల్లీ నుండి బొంబాయికి బయలు దేరారు.

ఇండొనీషియా యువజన ప్రతినిధులకు స్వాగతమిచ్చేటందుకై విద్యార్థి సంఘాల పని శక్తిగా పనిచేయాలని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శి కామ్రేడ్ అన్నదా శంకర భట్టాచార్య ప్రకటిస్తున్నారు.

ఆశియాదేశాల స్వాతంత్ర్యాన్ని రక్షిస్తుంది

వీట్-నామ్, ఇండొనీషియా నాయకుల సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రియల్ 5

అఖిల ఆశియాదేశాల మహాసభకు ఇండోచైనా, ఇండొనీషియాలనుండి వచ్చిన ప్రతినిధివర్గాల నాయకులు డాక్టర్ ట్రాన్‌వాన్‌లు ఆన్, డాక్టరు అబూ హనీఫాగార్లు దిగువ ప్రకటన చేస్తున్నారు:

"పెట్టుబడిదారీ దేశాల వలస పద్ధతులు ఆశియా దేశాలలో మరల వేళ్ళు పాతుకోనకుండా చేయడానికై ముఖ్యంగా కొన్నిపనులు చేయవలసివుంది.

(1) మిత్రరాజ్య సమితిలో సభ్యత్వమున్న దేశాలు సెక్యూరిటీ కౌన్సిలు ముందు వలసదేశాల ప్రజల సమస్యను, అందులో ముఖ్యంగా వీట్‌నామ్ సమస్యను చర్చించాలి

మారిపబ్లిక్కులను గుర్తించండి

(2) ఆశియాఖండ దేశాలు వీట్‌నామ్, ఇండొనీషియా ప్రజాస్వామ్య ప్రభుత్వాలను గుర్తించాలి.

(3) ఆశియా ప్రజల నెన్నో కష్టాల పాల్జేస్తున్న విదేశీయ సేనలను తొలగించడాన్ని ఆశియాదేశాలు వెంటనే అమలు జరపాలి.

(4) సామ్రాజ్యవాద దేశాలు ఇండో-చైనా, ఇండొనీషియాలకు అదనపు సైన్యాలను చేరవేయకుండా ఆశియాదేశాల ప్రజలు ఆటంకపరచాలి.

(5) ఇండొనీషియా, వీట్-నామ్‌లలో సామ్రాజ్యవాదులకు విరుద్ధంగా పోరాటం జరుగుతున్న రంగాలన్నింటికీ ఆశియా జాతులు, ప్రజలు వైద్యసహాయం, వలంటీరు దళాలూ పంపించాలి.

"ఆశియా దేశాలు ఒకదానికొకటి సాయపడగలమనీ, ఆ పరస్పర సహకారాన్ని సాధించగలమనీ, ఆశియా దేశాల మహాసభ మాలో విశ్వాసాన్ని కలిగించింది. అదేగనక జరగకపోతే ప్రపంచంలో శాంతి, అభ్యుదయం అనేవి ఎప్పుడూ ప్రమాదావస్థలోనే ఉంటాయి."

"అఖిలాశియా సంస్థను నిర్మించడంలో మంచిపనే చేశాం. కాని చేయవలసిందింకా చాలా వుందని మా అభిప్రాయం. ఆశియా ప్రజలు మేల్కొన్నారనీ, వారు పూర్తిగా స్వతంత్రులు కావడానికే కోరుతున్నారనీ, వలస రాజ్యాంగ పద్ధతిని సాధ్యమైనంత త్వరలో నిర్మూలించ దలచారనీ ప్రపంచానికి చాటుతున్నాం.

"అఖిలాశియా సంస్థలోని దేశాలన్నీ ఒకటి గుర్తించాలని మా కోరిక. ఐక్యకృషి పరస్పర సహాయంద్వారానే ఆశియాదేశాల స్వాతంత్ర్యాన్ని పెద్ద పెద్ద దేశాలచేత అంగీకరింప చేయగలం.

"నాగరిక దేశాలన్నీ వలస పరిపాలనా విధానం మానవజాతికి ద్రోహం అని అసహ్యం తెలుపుతున్నా, ఆ వలస పాలనాపద్ధతి అంతరించడంలేదని వీట్‌నామ్ ఇండొనీషియాలవేపు చూస్తే అవగతమవుతుంది. పైగా అది వెనకటికన్నాబిగూఢంగా ఎక్కువ తెలివితేటలతో అమలు జరుపబడుతూంది. దాని బారినుండి రంగుజాతులు బయటపడాలంటే సమైక్యత, సహకారం అవసరం.

"నవీన పద్ధతులతో విభజించి పాలించే ఎత్తుగడలతో సామ్రాజ్యవాదులు తమ వలస నీతిని, పీడనా పద్ధతిని సాగింపచూస్తున్నారు. కాని వలసదేశాలు, అర్ధస్వతంత్ర దేశాలూ కొన్ని స్వాతంత్ర్యం సాధించినా ఐక్యత లేకుండా వున్నాయి. ఫలితంగా శాంతి, స్వాతంత్ర్య రక్షణ, ప్రమాదంలో పెట్టకుంటున్నాయి

వలస నీతి కొత్తపుంతలు తొక్కుతూంది

"వీట్‌నామ్ ప్రజలు ప్రజాతంత్ర ప్రభుత్వాన్ని నిర్మించుకొన్నారు. కాని ఫ్రెంచి సామ్రాజ్యవాదులు సైనిక బలంతో ప్రజాభీష్టానికి విరుద్ధంగా తమ పెత్తనాన్ని పరిపాలనలో పెట్టి ఇండోచైనాలో ప్రజల స్వాతంత్ర్యాన్ని అడ్డుకుంటున్నారు. ఇండొనీషియా ప్రజలు ప్రజాప్రభుత్వాన్ని స్థాపించుకొన్నారు. కాని డచ్చిసామ్రాజ్యవాదులు తమ ఆయుధబలంతోనూ, అంతర్జాతీయ పెట్టుబడిదారీవర్గం ఇచ్చిన ధనసహాయంతోనూ వెలిబుచ్చుకొంటూ, మందీమార్బలాన్ని "ప్రాచ్య ఇండొనీషియా ప్రభుత్వం" అంటూ ఏర్పరచారు.

"సామ్రాజ్యవాదుల కొత్త ఎత్తుగడలు ఆశియాదేశాల స్వాతంత్ర్యానికి, శాంతికి, అభివృద్ధికి, ప్రపంచ క్షేమానికి చాలా ఆటంకాలు.

"ఏ దేశమైనా స్వతంత్రం సాధించాలంటే విదేశీ ప్రభుత్వాన్ని ఎదిరించడంలో ఆ దేశ ప్రజలు కూడగట్టుకోగలశక్తిమీద ఆధారపడి వుంటుంది. పొరుగుదేశాల తోడ్పాటు, సహకారం విదేశీ ప్రభుత్వాధికారం త్వరగా అంతరించడానికి తోడ్పడతాయి.

"ఇరుగు పొరుగు దేశాలూ, పెద్దదేశాలూ సామ్రాజ్యవాద దేశాలను సంతృప్తిపరచేటందుకై చేసే ప్రయత్నాల ఎంతవ్యర్థం కాగలవో వీట్-నామ్ పరిస్థితులు స్పష్టంగా తెలుపుతున్నాయి. పరస్పర సహకారం వలస యుద్ధం వ్యాపించకుండా భయపడ పనిలేదు. అవిధంగా చేయడంవలన వలస రాజ్యాక్రమణ నిరోధించబడుతుంది. వలస దేశాలకు స్వతంత్రం లభిస్తుంది. రంగుజాతులకు, ఆశియాకు న్యాయం లభిస్తుంది. అభివృద్ధి ఏర్పడగలదు."

మనమంతా ఏక కుటుంబీకులం

సుల్తాన్ షారీర్ రేడియో ఉపన్యాసం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4

నేటిరాత్రి ఆలిండియా రేడియోలో ఇండొనీషియా ప్రధాని సుల్తాన్ షారీర్ ఉపన్యసిస్తూ ఇలా చెప్పారు:

"అంతరంగికంగానూ, బాహ్యంగానూ కూడా అవాంతరాలు గడిచి భారతదేశం త్వరలోనే స్వతంత్రం పొందగలదని ఆశిస్తున్నాం.... మేము వేలకొలది మైళ్ళదూరం నుండి వచ్చినా పరాయిదేశం వచ్చినట్లనిపించడంలేదు. ఒకేఒక కుటుంబానికి చెందినవారి మధ్యకు వచ్చినట్లేవుంది. ఆశియా దేశాల మహాసభ ఆదర్శాలమీద మాకుగల విశ్వాసాన్ని చూపవలసివస్తే మేమిక్కడకు వచ్చాం. వచ్చినదని వ్యర్థంకాలేదు ఆశియా దేశవాసులం ఇలాకలుసుకోవడం ఇదేమొదటిసారి. మనం అంతా శాంత్యభివృద్ధులతో కూడిన మానవ ప్రపంచ నిర్మాణానికి కలిసి పనిచేద్దాం."

పంజాబు సమస్య విభజనతో పరిష్కారంకాదు

దేశాన్ని చీల్చాలనే బ్రిటిష్ కుట్ర మాత్రమే ఫలిస్తుంది

మతకలహాగ్నితో మాడిమసిఅవుతున్న పంజాబు శిథిలాలలోనుండి రాష్ట్రాన్ని విభజించాలనే ప్రతిపాదనలు అవశ్యకంగా బయలుదేరాయి.

పంజాబును ముస్లింముస్లిమేతర ప్రాంతాలుగా విభజించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకూడా వాంఛించింది

భారతదేశం ఏకంగా ఉండాలనే వారిలో ప్రముఖులైనవారే, భారత విభజనకు ఎందుకు అంగీకరించవలసి వచ్చింది?

మతవాదాన్ని తీవ్రంగా ప్రతిఘటించేవారే మతాన్నిబట్టి విభజించడానికి ఎందు కంగీకరించారు?

ఈ ప్రశ్నలను వేసుకొని వాటికి సమాధానం ఇచ్చుకోక తప్పదు.

పంజాబు సిక్కులూ, హిందువులూ పాకిస్తాన్ ఏర్పడుతుందేమోనని భయపడుతున్నారనడంలో సందేహం లేదు. విదేశాలల్లో ఉద్యోగాల్లో ఉన్న మతప్రాతినిధ్య సూత్రాన్ని విద్యావంతులైన హిందూ మధ్యతరగతి వారు చూచారు. అందుకు విరుద్ధంగా చిరకాలంనుంచీ పోరాడారు. ఈ బ్రిటిష్ నిర్మితమైన ఉద్యోగ మత ప్రాతినిధ్యాన్ని పాకిస్తాన్‌కు 'మాదిరి'గా భావించారు క్రమ క్రమంగా వారు పాకిస్తాన్‌కు తీవ్ర వ్యతిరేకులయ్యారు.

యుద్ధకాలంలోను, యుద్ధానంతరమూ బెంగాలు, సింధు, సరిహద్దు రాష్ట్రాల్లోని లీగు మంత్రివర్గాల ప్రవర్తన ఏకాయెకీగా వారి నందరిని వణికిపోయేట్టు చేసింది.

పంజాబులోనే ఎన్నో ఏండ్లుగా భూస్వాముల యూనియనిస్టుపార్టీ రాజ్యం చేసింది దాని పాలన కలుషపూరితమైనది. వారి పోలీసు రాజ్యంలో పంజాబీ ప్రజల బాధలు భారతదేశమంతటా బయలుపడినవి.

చాలకాలంనుంచీ యూనియనిస్టు పార్టీ పంజాబులోని ముస్లింలీగుగా ఉన్నది. ఆ పార్టీ ప్రధాని సికందర్ హయ్యత్ తన ముస్లింయూనియనిస్టులందరితోపాటు లీగులో చేరాడు.

పాకిస్తాన్ భయం

సికిందర్, ఖిజర్‌ల పోలీసురాజ్యంలో పాకిస్తాన్ చవిచూచిన పంజాబులోని హిందువులు సిక్కులు పాకిస్తాన్ అంటే భయపడడంలో ఆశ్చర్యమేమున్నది?

1945 లో లీగు యూనియనిస్టులనుండి విడిపోయినతర్వాతనే, తాము అసహ్యించుకునే యూనియనిస్టు ప్రభుత్వానికీ, ముస్లిం లీగుకూ ఉన్న భేదాన్ని వారు గుర్తించారు.

ఆతర్వాత పంజాబులో కొత్తదశ ఆరంభమయింది.

పౌరహక్కులకోసం, కాంగ్రెసు పక్షంల ఇతర రాజకీయఖైదీల విడుదలకోసం, అసెంబ్లీలోనూ, బయటాకొత్తలీగుపార్టీకాంగ్రెస్‌తో కలసి ఆందోళన సాగించింది.

అందులోపాటు పశ్చిమ పంజాబులోని ముస్లిములలో లీగుసాగించిన ఆందోళన వారి సామ్రాజ్య వ్యతిరేక వాంఛకు రూపం తీర్చి సంఘటిత పరిచింది.

అఖిలభారత రంగంలోఉన్న పరిణామాల కారణంగాను, కాంగ్రెసు లీగులు పంజాబులో ఏకీభావంతో నడచిన యూనియనిస్టుపార్టీని తదితర సామ్రాజ్యవాదసాధనలను నిర్మూలించే పేర్పాటవసించింది! దేశానికంతకూమార్గదర్శులవుతారా అని కాపేసుకోండి.

పంజాబు ప్రజలు - హిందువులు, ముస్లిములు, సిక్కులు కూడ — ఎన్నికలలో ఇందుకు సమాధానమిచ్చారు. అత్యధిక సంఖ్యలో కాంగ్రెస్ లీగులను ఎన్నుకొని యూనియనిస్టుపార్టీకి ఎంతఅధికారులు అంత ఉన్నప్పటికీ తొలగించివేశారు.

ప్రజాక్షేమానికి హామీ ఇచ్చే కాంగ్రెస్ లీగు సంయుక్త మంత్రివర్గంకోసం పంజాబు ఎదురుచూచింది కాని, సంప్రతింపుల ప్రారంభంలోనే అఖిలభారత రాజకీయాలను బట్టి పంజాబు పేరుపడిపోలేదని స్పష్టపడిపోయింది.

కాంగ్రెస్ వర్కింగుకమిటీ తీర్మాన సమీక్ష

మౌలానా అజాదు ప్రోద్బలంతో కాంగ్రెస్, లీగు మంత్రివర్గ నిర్మాణాన్ని విరోధించేందుకై సామ్రాజ్యవాద దాసులైన యూనియనిస్టులతో చేరేందుకుకూడ అంగీకరించింది.

కాంగ్రెస్ యూనియనిస్టు కలయికపై వకపుగా కాంగ్రెస్ వర్కింగుకమిటీకి ఫిర్యాదులు వచ్చాయి. ఇక్కడ వివరాలలోనికి పోవనవసరంలేదు. కాని ఆ మంత్రివర్గ పాలనలోని ఒక ప్రధాన లక్షణాన్ని గుర్తించవచ్చు. 1937 నుండి 1946 వరకున్న యూనియనిస్టు మంత్రివర్గ ప్రధానలక్షణాలైనపోలీసు రాజ్యం, లంచగొండితనం, ఉద్యోగాలలో బంధుత్వానికిప్రాముఖ్యం, ఇవన్నీ చెక్కుచెదరకుండా కొనసాగాయి.

కాంగ్రెస్‌వాదుల అసంతృప్తి

కాంగ్రెస్ అనుచరులు, సామాన్యప్రజలందరికీ మంత్రివర్గంపై అసహ్యం కలిగింది. కాని యూనియనిస్టులతో విడిపోవాలన్న వాంఛను గట్టిగా ప్రకటించనీకుండా కాంగ్రెస్ నాయకులు అడ్డంకివరుస్తూ వచ్చారు ఇలా చేస్తే లీగుమంత్రివర్గం ఏర్పడుతుందని,అందువల్ల భారత దృష్ట్యా పాకిస్థాన్‌వాంఛ బలపడుతుందని కాంగ్రెసు నాయకులు తమ అనుచరులను భయపెట్టారు.

కాంగ్రెసు బ్రిటిష్ ప్రణాళికను అంగీకరించి, గ్రూపింగు సమస్య ప్రాధాన్యతకు రాగానే, యూనియనిస్టులకు, ఏ యెండకా గొడుగు పట్టే అకాలీలకు, కాంగ్రెసు చాల సౌకర్యాలిచ్చింది. ఎందుకంటే కాంగ్రెసు లీగులకు మధ్య 'బి' గ్రూపులో వారిదే కీలక స్థానం, వారెటు మొగ్గితే అటు బలమేర్పడుతుంది.

ఇలా పార్టీలకు పోటీని సున్నితంగా ఉంచి తయారుచేసిన సాకు బ్రిటిష్ ప్రణాళికను కాంగ్రెసు అంగీకరించడంతో ఏర్పడిన విచారకర ఫలితమేయిది.

కాని ఇవన్నీ ఇలా ఉన్నప్పటికీ దేశంలోని ఇతర భాగాల్లోలాగా మతకలహాలు కొన్ని నెలలవరకు రాలేదు. అయినా మరా వేళలేకొ క్రమంగా పెరిగిపోతున్నవి. ఇందులో వివిధపార్టీలలో మార్పులు త్వరత్వరగా జరిగాయి.

ఆర్థిక సంక్షోభం మూలంగా భూస్వాములకు వ్యతిరేకంగా ముస్లిం రైతులు సంఘటితమవుతున్నారు. ముస్లిం కార్మికులు త్వరత్వరగా సంఘశక్తిని, సంయుక్త సంఘాలను గుర్తిస్తూ వచ్చారు. ముస్లిం కార్మిక సంఘాలు ఏర్పరచాలనే లీగు అభివృద్ధి నిరోధక నినాదాన్ని నిర్లక్ష్యం చేయసాగారు.

లీగు నాయకుల భీతి

ముఖ్యంగా భూస్వాములైన లీగు నాయకులు భయభ్రాంతులయ్యారు, తమ ఎన్నికల ప్రణాళిక సంగతి మొత్తంగా మానివేశారు. తమ రైతులపై తమ పెత్తనం రక్షించుకొనేందుకు మత విద్వేషాలను రెచ్చగొట్టజూచారు. భూస్వాముల పీడనకు వ్యతిరేకంగాచేసే పోరాటాన్నుండి రైతులను, లీగుపేరుతో మత పోరాటంవైపు త్రిప్పజూచారు.

కాంగ్రెసను రోలిమంది బలపరుస్తూ వచ్చిన అనుచరవర్గంలో కూడ మార్పు జరిగింది. పంజాబు కాంగ్రెసులోని ముఠాలతో విసుగెత్తి, కాంగ్రెస్ మంత్రివర్గం అవలంబె దాసపాలన అసమర్థత తెలిసిపోవడంవల్ల వారు చాలవరకు మితవాదుల లోకి పడిపోయారు. యువకులలో త్వరత్వరగా రాష్ట్రీయ స్వయం సేవక సంఘం వ్యాపించింది.

కాంగ్రెస్ బ్రిటిష్ ప్రణాళికను అంగీకరించడంతో, కాంగ్రెస్ అనుచరుల దృష్టి బ్రిటిష్‌వారినుండి మరలింది. లీగును ప్రధాన శత్రువుగా పరిగణించసాగారు. కాంగ్రెస్, గ్రూపింగు సూత్రాన్ని అంగీకరించడంవల్ల తప్పనిసరయిన పాకిస్తాన్‌నుంచి తమ్ము రక్షించుకోవాలంటే, ఒక్క రాష్ట్రీయస్వయం సేవకసంఘమే గతి అన్న దృష్టి పంజాబు హిందువులకు కలిగింది.

ఇవన్నీ తెలుసుకోవడం ఎందుకవసరమంటే, ఈ పరిస్థితులలోనే లీగు ఉద్యమం, మతకలహాలు వచ్చింతర్వాత, నేడు కాంగ్రెస్ వర్కింగు కమిటీ పంజాబును విభజించాలన్న నినాదాన్నిచ్చింది.

ఇది కొత్త నినాదం కాదు

ఇదికొత్తనినాదంకాదు. సమయానుకూలవాదులూ, మతవాదులూ అయిన అకాలీలు కొన్నేళ్ళనుండి "అజాద్ పంజాబ్" అంటూ ఒక ప్రణాళికను చెబుతూ వచ్చారు.

పంజాబును విరంతులకంగా రెండుగా చీల్చాలని ఆ ప్రతిపాదన కోరుతుంది: ఒకటి ముస్లిం మెజారిటీగల పడమటి పంజాబు; రెండోది మిగతజిల్లాలన్నీ (ముస్లిం మెజారిటీ గల రెండు జిల్లాలు కూడ కలిపి) కలిసిన ప్రాంతం. ఇలా కలపడంవల్ల మొత్తం ప్రాంతంలో హిందువులు 40 వంతులు, ముస్లిములు 40 వంతులు, సిక్కులు 20 వంతులు ఉంటారు.

హిందూ ముస్లిముల విభేదాలను ఉపయోగించుకొని ఈ కృత్రిమంగా నిర్మితమైన రాష్ట్రంలో సిక్కులే నిజమైనపాలకులు కావచ్చుననిసూచిస్తూ, అకాలీలు సిగ్గులేకుండా ఈ 'అజాద్ పంజాబ్'ను గూర్చి తమ అనుచరులకు నూరిపోశారు.

కాని పంజాబు ప్రజలు దీనికంగీకరించలేదు. సిక్కులలో అధిక సంఖ్యాకులు అకాలీలకు వ్యతిరేకంగా కాంగ్రెసుకు, కమ్యూనిస్టులకు ఎక్కువవోట్లిచ్చారు. (స్థానాల సంఖ్యమాత్రం కాంగ్రెస్‌కన్నా అకాలీలదే ఎక్కువయినప్పటికీ)

పాకిస్తాన్‌ను గూర్చిహిందువులకు, సిక్కులకు ఎంత భయమున్నప్పటికీ పంజాబీలు తామందరూ ఒకేజాతి అని, ఒకే భాషమాట్లాడేవారు రాష్ట్ర మంతటా అన్నిమతాలవారూ చెల్లాచెదురుగా కలసిపోయి ఉన్నారని గుర్తించారు. అందువల్లనే అజాద్ పంజాబ్, ప్రజలను ఆకర్షించలేదు.

పంజాబు విభజనను సూచించే రాజాజీ ప్రతిపాదనకూడ కాంగ్రెస్ ప్రజలు ఇష్టపూర్వకంగా అంగీకరించలేదు.

కాని నేటినిరంకుశోద్యోగుల ఎత్తుగడకు ఫలితంగా చెలరేగిన మతకలహాల సమయములో తిరిగి ఆ పాత విభజన వివాదాన్ని తెచ్చారు. విపరీతంగా బయలుదేరిన రాక్షస హింసకు ఇదొక్కటే పరిష్కారమార్గమని ఆ నినాదాన్ని గట్టిగా పట్టుకున్నారు. అది లేనిదే ఈ దురంతాలిక ఆగిపోవని భావించారు.

ఇది గత్యంతరంలేని ఆఖరు పరిష్కార మార్గమనే సంగతిని కాంగ్రెసు వర్కింగు కమిటీ దాచడంలేదు. విభజన తనకేమాత్రం ఇష్టంలేదు. కాని మరొక మార్గమేమిటని ప్రతి కాంగ్రెసువాదీ అంటాడు.

అట్లీ ఫిబ్రవరి 20 వ తేదీ చేసిన ప్రకటన ప్రకారం అధికారాన్ని ఇప్పుడున్న రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగిస్తారు. ఇందులో పాకిస్థాన్ దాదాపు తప్పనిసరిఅయిపోతుంది. ఇలాంటప్పుడు ఏదో సాధ్యమైనంత భాగాన్ని పాకిస్తాన్‌లోకి పోకుండా ఎందుకు రక్షించుకోరాదు? అని ఆ కాంగ్రెసువాది అంటాడు.

ఈప్రతిపాదనను సమర్థించేందుకు బ్రిటిష్ ప్రణాళికను కాంగ్రెస్ నాయకులు ఉదహరిస్తున్నారు. తనకు ఇష్టంలేనిది ఏ ప్రాంతాన్ని గాని ఏ గ్రూపులోనూ చేర్చము అని బ్రిటిష్ ప్రణాళిక హామీని ఎత్తిచూపుతున్నారు. ఈ ప్రతిపాదనలో "ప్రజాతంత్ర" సూత్రం వున్నట్టు చెప్పుకుంటున్నారు

మరి లీగు నాయకులు తీవ్రంగా ఈ విభజనను తన మతదురహంకార కారణాలతో ప్రతిఘటిస్తున్నారు. అవేదిస్పష్టమే. కానిపంజాబు ప్రజలందరూ ఒక్కటే అన్నసూత్రంపై తాము విభజనను కూడదంటున్నట్టుగా నటిస్తున్నారు.

మత దురహంకారానికి సహాయం

కాంగ్రెస్ వర్కింగుకమిటీ తీర్మానాన్ని అకాలీ నాయకులూ, రాష్ట్రీయ స్వయంసేవక సంఘంవారూ తూర్పు పంజాబులో మతకలహాలు రేపేందుకు ఉపయోగించారు. ఆ ప్రాంతమంతా కొట్లాటలు చెలరేగాయి.

కాబట్టి వర్కింగుకమిటీ తీర్మానం కేవలం మతకలహ జ్వాలలను వ్యాపింపజేసేందుకు మతదురహంకారులకే తోడ్పడింది.

మతకలహాలను ఆపేందుకే వర్కింగు కమిటీ తీర్మానం ప్రధానోద్దేశమయితే అది విఫలమయినట్టే

మరి ఈ ప్రతిపాదన పాకిస్తాన్ రాకుండా చేయగలదా?

అలా పాకిస్తాన్‌ను ఆటంకపరచలేకపోవడమే గాక అసలీ కాంగ్రెస్ వర్కింగుకమిటీ



బ్రిటిష్ వాడి కత్తిపసందు

మా దేహాన్నేకాదు - మా హృదయాలనుకూడా చీల్చింది - అని మహోన్నాడుట

రమేశచంద్ర

తీర్మానంలోనే భారతదేశ విభజన ఇమిడి ఉన్నది

ఆ విభజన నేటి పరిస్థితుల్లో ఎలా పరిణమిస్తుందో స్పష్టమే. ఇండియా వాయవ్య సరిహద్దులో (బి గ్రూపు) బ్రిటిష్ సైనిక కేంద్రం నిర్మితమవుతుంది. అక్కడి "స్వతంత్ర ప్రభుత్వం" అనే దానితో బ్రిటన్ "సంధి" చేసుకొనే ఆ పని చేస్తుందని ప్రకటించే మాటలో నిజమైన అర్థం అందరికీ తెలియనే తెలుసు.

కనీసం ఏ గ్రూపయినా కనీసం కాంగ్రెస్ ఇండియా అయినా స్వతంత్రంగా ఉంటుందని కాంగ్రెస్‌వాదులు ఊహించుకుంటున్నారు.

వాస్తవ పరిస్థితిని గుర్తించడానికి వారు నిరాకరిస్తున్నారు. 1948 జూన్ నాటికి ఏ గ్రూపును బ్రిటిష్‌వారు వదిలిపోతారని వాదనకే మాత్రమే అనుకున్నప్పటికీ బ్రిటిష్ సేనావాహిని మననెత్తిన కూచున్నప్పుడు ఇక స్వతంత్ర మనేదేముంటుంది?

నిజస్థితేమంటే బ్రిటిష్ ప్రణాళికను నిరాకరించేందుకు కాంగ్రెస్ ఒప్పుకోవడంలేదు. ఇక ఆ ప్రణాళికను అమలు జరపాలంటే అసలు దేశవిభజనే ఒప్పుకోక తప్పదు.

పడమటి పంజాబులో జరిగిన దారుణ దురంతాలతో ఇంతకుముందెన్నడూ లేనంతగా పంజాబు హిందువులు, సిక్కులు ఉద్రేకం చెందారు. రావల్పిండి డివిజన్‌లో జరిగిన హత్యలు, లూటీలు పాకిస్తాన్ ఎటువంటిదో నిరూపిస్తున్నదని చెప్పడంలో వారు అలాంటి పాకిస్తాన్‌నుండి తప్పించుకొని బయటపడాలని చూస్తున్నారు.

మత ప్రాతిపదికపై విభజన చేయాలన్న ప్రచారం మూలంగానే పడమటి పంజాబులో ఘోర హత్యలు జరిగాయి. అలాంటప్పుడు తమ్ము రక్షించుకొనడానికి ఆ విభజనే మార్గమనుకోడం సరిగాదన్నది స్పష్టంగా కనిపిస్తూనే వుంది.

సుఖమయ జీవనంకోసం హిందూ, సిక్కు సోదరులతో కలిసి రాష్ట్రమంతటా పోరాటం సాగిస్తున్న సామాన్య ముస్లిం ప్రజానీకాన్ని-రైతులను-కార్మికులను, వారు జ్ఞాపకం చేసుకోవాలి.

సుఖమయ జీవనంకోసం తమ సోదరులైన హిందూ, సిక్కు గుమాస్తాలతోను, ఉపాధ్యాయులతోను, కర్షకులతోను కలిసి పోరాటం సాగించినట్టి, ఇంకా పోరాటం సాగించడానికి సిద్ధంగా వున్నట్టి ముస్లిం గుమాస్తాలను, ఉపాధ్యాయులను, కర్షకులను వారు జ్ఞాపకం చేసుకోవాలి.

వారే పన్నాగాన్ని భగ్నం చేయగలరు

వారే నిజమైన పంజాబీలు యావత్ భారతదేశ దాస్యానికి కారణమయ్యే విభజనను భగ్నంచేయగల శక్తి సామర్థ్యాలు వారికే ఉన్నవి.

పంజాబు ముస్లిం లీగులోని అభ్యుదయ వర్గాలు తాము సామ్రాజ్యవాదులకు చేసిన వాగ్దానాలను జ్ఞాపకం చేసుకోవాలి. మరొకవైపు తమ నాయకులలోని అభివృద్ధినిరోధకుల మాటలను త్రోసిపుచ్చి కార్మికులు రైతులవైపు మరలాలి. వారిని ముస్లిం హిందూ సిక్కు సంయుక్తవర్గ సంస్థల నిర్మాణానికి పూనుకోవాలి. అదొక్కటే పంజాబు మతకలహాగ్నిలో భస్మమైపోకుండా కాపాడగల ఏకైకమార్గం.

"పంజాబు ఒక్కటే (హిందూస్థానీ మాట్లాడే అంబాలా డివిజన్ తప్ప)రాష్ట్రం మేమంతా పంజాబీలం" అని సంఘటిత కార్మికవర్గక సంస్థలూ, కొత్తగా సంఘటితులైన మధ్యతరగతి ఉద్యోగులూ నినాదమివ్వాలి. (మిగతా 12 వ పేజీలో)

చిన్న కథ

బతకలేక బడిపంతులు

లక్ష్మీకాంతమోహన్

ఎందుకో తెలీదు. సెలవు దొరికిందనో, యింట్లోని 'కుచేల నృత్యం' దాటికి తట్టుకోలేకనో - మరెందుకో - నా మిత్రుణ్ణి చూడాలనే కోరిక కలిగింది (అంతేగాక కొంచెం పనిగూడా వుంది లెండి).

"నీకెందుకు నే వస్తేనరిగా, ఎల్లుండి గడియారం ఆరుకొట్టకముందే రెక్కలు కట్టుకొని నీదగ్గర వాల్తాను. సరా?" మా ఆవిడకి మాటయిచ్చి బజారుకు బయలుదేరాను. పెద్దలవద్దకి, స్నేహితులవద్దకి (వుద్యోగస్థులవద్దకి గూడా అనుకోండి) వెళ్ళేప్పుడు ఏదన్నా ఫలం గానీ, పైపాగానీ పట్టుకెళ్ళమన్నారు గాబట్టి, చౌకగా దొరికే నారింజకాయలు కాయ అణాన్నరచేసి ఓ డజనుకొన్నాను.

ఆ సంచి చేత్తో పట్టుకొని బస్సు కోసం 'ప్రాణాధారం' పట్టాను. ఎండ తీవ్రమౌతూంది. చెమట పూరుతూంది. ఈ చిరాకును పోగొట్టడంకోసం మన "నక్షత్ర వీధులకి అలంకార భూషణం" అయిన సన్నని చెత్తా, చెదారాల్తోకూడిన దుమ్ము ముఖంనిండా, ముక్కుల్లోకీ "గులాం" కొడుతూంది. కూర్చొనే వారూ, కూచోలేక నుంచునేవారూ, నుంచోలేక పడిచేవారూ, పడుస్తూ నిసుగుతో ముఖం చిట్లిస్తూ అటూ యిటూ చూస్తూ యెవరినో లంకించుకొని బాతాఖానీ కొట్టేవారూ - రకరకాలవారు - ఆ బస్సు స్టాండువద్ద - ప్రవసిస్తూన్నామె భర్తయెంత అదృష్టశాలో, హృదానిధిలోమా వుంటాడో - అలా వున్నారు. ఎన్నో అవస్థలల్తో తట తట కొట్టుకుంటూ వచ్చి బస్సు ఆగింది. వొక్కసారిగా అంతా ఆ బస్సుమీద కలియబడ్డాం. నేను కొంచెం వెనకపట్టంవల్ల ఖాళీ దొరకలేదు. (ఏ ముసలాణ్ణో దబాయించి లాగేసి కూచుందామన్నంత కోపంవచ్చింది.) ఈలాంటిసమయంలో ప్రాణాయామంనేర్చినవాణ్నయ్యి వుంటే యెంత బాగుండేది. చక్కగా గాలి బిగబట్టి, నెట్టి, లోపల చేరేవాణ్ణిగదా అనుకొంటూ పక్కనేవున్న వో గోడపీటని కూచున్నా.

ఇంతలో ప్రజా మంత్రులు, ప్రజా రాజ్యం, అంటూ వో కుర్రాడు పత్రిక లమ్ముతున్నాడు. 'నా పాటే' అనుకొంటూ కాలక్షేపంకోసం వో పేపరు కొని, వొక కన్ను బస్సుస్టాండువైపు పెట్టి, రెండోకంటితో చదవసాగేను.

ఆఖరికి యెట్లాఅయితేయేం మిట్ట మధ్యాహ్నపు వేళకి ఖాళీ దొరికింది యెంతో శరీర పరిశ్రమచేస్తూ, వాగ్బాణాన్ని చూపెట్టగా.

నాకెదురుగా నోపందు ముత్తయిదు కూచుని అదేపనిగా నావంక చూస్తోంది. నాకర్థం కాలేదు. బస్సుల్లోనూ, రైళ్ళల్లోనూ యెక్కినప్పుడు వొకవిధమైన దమనూ చురుకుదనమూ పుట్టుకొస్తాయి. అలాంటి దమనుతోనే—

"మామ్మా! యెక్కడికెళుతున్నావు?" అని అడిగాను.

"ఇంటికిరా నాయనా. పన్నెరగవూ? మీ నాయనగారి బావమరిది బావమరిదికి మాఅమ్మాయి అరబిడ్డ నిచ్చారు...." నవ్వని ముడుతలు పడిన ముఖాన్ని యింకా ముడుతలు పడేస్తూ, పెదిమలు తెరవకుండా చిరునవ్వు నవ్వుతూ, పొలిపోయిన కళ్ళతో నా ముఖంలోకి చూసింది.

ఇకనేమి చెప్పటానికితోచక "నువ్వా మామ్మా పాలపాడు నుంచికాదూ వస్తూంట?" అని తెలివిగా ప్రశ్నించాను. కాని నాతెలివి తెల్లారింది.

"కాదునాయనా యీ బెజవాడనుంచే"

ఇక అసలే తోచక, "వుహూఁ" అన్నాను.

ఆమె మళ్ళీ అందుకొంది. "మా అబ్బాయి-కిష్టుడు-ఇక్కడేవుంటున్నాడు. అందుకని చూసిపోదామని వచ్చా...."

"వుద్యోగమా?"

"వుద్యోగంకూడానా నాయనా! మా బతుక్కి అదిగూడానా? వాళ్ళ నాయన వేదాలు నేర్చుకోనియ్యమని యెంత చెప్పినా వినకుండా, నేనే పట్టుబట్టి కాలేజీ చదువు చెప్పించా. మరి ఇప్పుడేమన్నా నాలుగురాళ్ళ నౌకరీ దొరుకుతుందా అంటే అది వల్లపూసైంది. దాని కోసమే తిరుగుతున్నాడు. ఇక్కడ మేనమామవద్ద వుండి పగలల్లా తిరిగి వస్తాడు ఆ అయ్యవద్దకూ యీ అయ్య వద్దకూ...."

"మన చేతుల్లో యేముంది మామ్మా: అంతా కాలమహిమ!" అని యెనభై యేళ్ళ ముసలాయన అన్నట్లు అన్నాను.

"బాగా అన్నావు బాబూ. నూరేళ్ళాయుస్సు. లేకపోతే యిదివరకు - నా చిన్నతనంలో - యేడు తరగతులు చదివినవాళ్ళకు చక్కని వుద్యోగాలు. మరి ఇప్పుడెంత చదువుకొన్నా యెంగిలి స్తరాకు విలువన్నా లేదయ్యే"

"అంతే. అంతే. యేం చేస్తాం?" యింకా కొంతసేపు నా పెళ్ళి, భార్యా, పిల్లలూవద్దనించి, కొబ్బరినూనె, అగ్గిపెట్టెలు వరకూ మాట్లాడుకొన్నాం నాలుగైంది. కదిలిస్తూ, యెత్తేసికొడుతూ అవూరు తీసికొచ్చింది బస్సు.

"వస్తా మామ్మా"అని దిగాను.

ఇరుకుగానూ, ఎగుడు దిగుడుగాను వున్న సందుగొందులుదాటి, ఆ యింటి వద్దకొచ్చాను. అదో పెంకుటిల్లు. ఇల్లు వేసి యెన్నేళ్ళయిందో గాని పగిలిన పెంకులూ, కర్రముక్కలూ, గుడ్డపేలికలూ, యెండిన ఆకులూ—ఆ ఇంటికప్పు మీద చిందరవందరగా వున్నాయి. ఎవరో ముసలాయన అరుగు మీది మంచంమీద పడుకొని వున్నాడు. తలుపు తెరచేవుంది. తెలీటం కోసం దగ్గేను. ఆయనకు వినపడవట్లుంది గడప యెక్కబోయేప్పుడు నన్నుచూసి "ఎవరువారూ?" అని కొద్దిగా తలయిటు తిప్పేడు.

మర్యాదపూర్వకంగా "నేనేనండి" అన్నాను.

"నువ్వటోయ్ సుబ్బారావూ!" అన్నాడు బలవంతంగా లేస్తూ.

"లేదు తాతయ్యా! నేను సోమయాజుల్ని...."

"వోహో నువ్వట్రా! యిట్రా, యిట్రా. పెదవముసలితనం. కళ్ళుకనబడవు. హమ్మా: వరుం పెరుక్కుమంది. యిట్రా...."

నేను మంచంమీద కూచున్నా.

"యేరాబాబూ రెండు సంవత్సరాలైనా కనపడ్డావుకావు?"

"ఆ....యేమీలేదే. వద్దామంటే తీరుతుందా. వస్తుందా?"

ఈ సంభాషణ యెందువల్ల మార్చదలిచాడో యేమో—

"సంతానమూ యేమన్నా?" అని అన్నాడు.

"యిద్దరు ఆడపిల్లలూ, వొక మగపిల్లాడూ"

"ఆహా....సరే....అయ్యో....నా మతిపోను. కాళ్ళకి నీరన్నా యివ్వలేదు" అని నీళ్ళుతెచ్చియిచ్చాడు—నా మిత్రుడి భార్యతలుపుచాటుననగంవరకూ వొదిగి.

"అంతా బావున్నారా?" అని పరామర్శించింది. సన్నగానూ, నీరసంగానూ పాలిపోయివున్న ఆమెనిచూస్తే నాకు ఆశ్చర్యం కలిగింది. రెండేళ్ళనాడు బొద్దుగా చక్కగా వుండేది. యెంతలో యెంతమార్పు!

"ఆ అంతా బాగున్నారు"అన్నాను.

"పిల్లలు బావున్నారా?" తల్లికొక్క దానికే సహజమైన దానితో ప్రత్యేకంగా అడిగింది.

"ఆహాఁ"

"అక్కయ్యగారు...?"

"ఆఁ అదే బాగు...."

"యెరగంది యేముందిలే నాయనా. యిద్దరు పిల్లలు పుడితేనే యీ కాలపువారు అరవైయేళ్ళ ముసలమ్మకంటే వుస్సురుమంటూ వుంటారు. యేమిటో కాలం, ఆ? ఆ కాలపువారు చేరెడేసి కళ్ళు, చెయ్యెత్తుమనుషులూ...." మధ్యలో తాతయ్య అందుకొని యేమిటేమిటో చెప్పేడు.

పొద్దుకూకింది. చీకటిపడింది. భోజనాదికాలు ముగించి, ఆరుబయట ఆయనా నేనూ మంచాలమీద కూచున్నాం.

"అయితే తాతగారూ! యిందాక సుబ్రమణ్యం యెక్కడికో వెళ్లారంటిరే. యెక్కడికి?"

"యెక్కడికేమిటి? వాడి అవస్థ...."

ఇంతలో ఐదారుగురు పిల్లలు ఏదో కేకలాడుతూవస్తూ, కొత్తగా వచ్చిన నన్నుచూసి గోలఆపారు.

"ఆ పిల్లలు బడిపిల్లలా తాతయ్యా? ప్రైవేటు యేదన్నా...."

"బడిపిల్లలూగాదూ బండలుగాదూ మావాడి కొడుకులు. యేమోలే నాయనా ఇంత కమ్మటిముద్దతో పొట్ట నిండక పోయినా, యీ పిల్లల్ని చూసైనా పొట్ట నిండుతుంది. దరిద్రుడికి పిల్లలూ, ధనవంతుడికి డబ్బులూ అంటే ప్రేమ...."

"అయితే మన సుబ్రమణ్యం జీతం పెంచారా?" మర్యాదకోసం మాత్రమే యీప్రశ్న అడిగాను. లేకపోతే పెంచేదీ, పెంచందీ నాకు తెలీదుగనకనా?

"ఆజీతం సంగతేమోగాని, మా తలల్లో పేలూ, మంచాల్లో నల్లులూ, పెరిగినయ్యి. ఏదికొనబోయినా ఆకాశం ఎక్కి దిగనంటూందే! అయినా వాటి తప్పేముంది? అబ్బాయీ, నువ్వేమన్నా అనుకో. నేనుమాత్రం వుండబట్టలేక పోతున్నా. ఇదిగో విను. చెంబుపట్టుకొని, బిక్షాందేహి అని యిల్లిల్లూ తిరిగి వాడికి చదువు చెప్పించానే! యెందుకు జ్ఞానంలేకపోవాలి? ఈయనకు కాంగ్రెసా? ఆ గాంధీగారెవరో బయలుదేరి దేశానికి పూలకూడు తినిపిస్తాంటే యీ బ్రాహ్మణముండా వాడు పోనా? అప్పుడు — అదేమిటి — సత్యాగ్రహమా — అది చెయ్యనా? దాంతో ఉద్యోగం దొరక్క అడుక్కొని తిన దమా? పెద్దముండా వాణ్ణియిదినేను మన బ్రాహ్మణీకానికి తగదన్నానుగా. వినరాదూ? ఇప్పుడుఖారు. యీయన కాంగ్రెసువారేగా పెత్తనం చేసేదీ? యీయన మొహం చూశారా? మాటకటామనోమయాజులూ....మరేమనుకో మాట....అగ్గిపెట్టెలు, కొబ్బరినూనె. యేదికొందామన్నా భగ్గుమని మండుతుండెనే! యిదేనా కాంగ్రెసువారిమేలు? చెప్పూ? మేము కానిదేశంలో....పని చస్తుంటిమే! ఎవరువింటారు? ఇంటి అద్దె, చాకలి, మంగలి - ఇవన్నీ గడిచే దెట్లా?....ఆ?....అదీమా ...."

"అది గాదు తాతయ్యా. చేస్తారంటలే...." పూరికినే అన్నానుఆమాట.

"ఎప్పుడూ? యేదీ? వెనకటి కొహడు చచ్చేదాకావుంటే పెళ్ళిచేస్తానన్నాడుట అలావుంది వీరిచెయ్యటం! అదీమా....మరీ....అదేమిటి — అసెంబ్లీ అంట దానిలో నేనువుండాలంటే నేను వుండాలని జంఝూటాలు త్రెంపుకుంటున్నారట. వీరేనాచేసేదీ? యిదిగో....వీళ్ళే గనక అన్నాను. ఎక్కడన్నా అనేవు సుమా! మనకెందుకొచ్చినపీడ. సరే గానీ....యేంచేస్తున్నావు?"

"తాలూకాఫీసులో గుమాస్తా"

"మంచి వుద్యోగవేఁ"

"నా శ్రాద్ధం, చెప్పుకుంటే సిగ్గుచేటు"

"అదేంటి నాయనా?"

"వచ్చే డబ్బుల్తో పురిత్రాడు కొనుక్కొని వురిపోసుకుందామన్నా చాలదు. వుద్యోగమన్నమాటేగాని కదిల్తే కంపు."

"అపుడ్రాబాబూ, ఇదంతా చూస్తావుంటే వీర వసంతరాయుడు పుట్టాడని నాకు పట్టి సందేహంగా వుంది"

"అక్కర్లేదు. మన దేశంలో వీర వసంతరాయుళ్ళు యిప్పటికే బోలెడంత మంది వున్నారు"

"ఏమోలే నాయనా, చివరికి యెట్లా రాసివుందో అట్లా అవుతుంది. ఖర్మ తప్పుతుందా? మావాడు........ "

తాతయ్య యీ మాట అనేసరికి నా మనస్సులో ఎందువల్లనో వొక్కసారిగా సత్యాగ్రహ దినాలు జ్ఞప్తికొచ్చాయి.

ఆరోజు ఎర్రని అగ్గి మాడ్చిపారేస్తుంది. చెట్లూ, చేమలూ, మనుషులూ, యిళ్ళూ - వొకటేమిటి - అన్నీ కుతకుత వుడుకుతున్నాయి ఆ వేడికి.

"మన గాంధీ దేవుని మీరంతా
మనమున దలచి,
కనుదు అదే భరతమాత
కోర్కెతో బిలచీ"

ఈ పాట ఆ వూరేగింపుతోపాటు బజారుగుండా దూసుకుపోతూంది. సుబ్రమణ్యం గొంతెత్తి పాడుతున్నాడు. తేవురించిన ముఖాల్తో మిగతావారు ఆ పాటను అందుకుంటూన్నారు. ఇంతలో ఫట్....ఫట్....పోలీసు లాఠీలు ఊరేగింపుపై బడ్డాయి. పోలీసులు గాంధీ టోపీలు లాగి కాళ్ళతో మట్టగిస్తున్నారు. బూతులు తిడుతున్నారు. వుమ్మేస్తున్నారు. దానికొక్కటే జవాబు "గాంధీకి జై. కాంగ్రెసుకూ జై".

సుబ్రమణ్యాన్ని వో లావుపాటి పోలీసు కానిస్టేబులు చచ్చేట్లు బాదాడు. అతని ఖద్దరులాల్చీ చిరిగిపోయింది. లాఠీతో వంట్లమీద పొడిచారల్లేవుంది. నోటివెంట రక్తం కారుతూంది. పెదవులు చిట్లిపుచ్చివున్నాయి. కాని చేతిలోని జెండాపట్టు మాత్రం వదల్లేదు.

తర్వాత అతనికి జైలు. బయటి కొచ్చినాక నానా అగచాట్లూపడి బడి పంతులయ్యాడు.

అలాంటి సుబ్రమణ్యం— కాదు— యిలాంటివారుతమసంస్థఅయినకాంగ్రెస్ పరిపాలనలో యీ నికృష్టస్థితిలోవున్నా రంటే యేమనాలి?

తాతయ్య మళ్ళీ చెప్పసాగాడు.

"నేను వద్దురా అంటాను. మా సుబ్రమణ్యం యిప్పటికీ ఆ కాంగ్రెసును వదిలిపెట్ట నంటాడు. యేమిటేమిటో చెబుతాడు, నాయనా....కాస్త నువ్వన్నా చెబుదూ! యిదుగో చూడూ! పగలల్లా ఆబల్లో పిల్లల్తో వేగివెనరాకుంటాడు. సాయంత్రం యింటికొచ్చేసరికి అవ్వనీ, యివ్వనీ వేధించుకుతింటాడు. ఆ పని హేమరూపాయిలా యెన్ని[illegible] తర్వీ! యింట్లోకి, యిన[illegible] దకి....? పైగా ఆడపిల్ల[illegible] భవేత్ కన్యా' అని యెవి[illegible] ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు చెయ్య[illegible] లైతే నీళ్ళదంతా తగుల[illegible] మన బ్రాహ్మలు ఘొల్లుమంటారు. చేద్దామంటే డబ్బేది? ఇటు చూద్దామంటే ఆంజనేయులవారి వాలం పెరిగినట్టు అన్నిటికీ ధరలు పెరిగే! పూర్వంలో... ఆ ఆంజనేయులస్వామి..మహా[illegible] లంకాదహనం చేసినట్టు యీ [illegible] ధరలు మన కొంపల్నీ, మనల్నీ [illegible] వున్నాయి. యెవరువింటారు? [illegible] రికిచెబుతాము. సరే?....కాని[illegible] ఆయిూళ్ళవరుదే...."

నాకు యేమిచెప్పాలో తెలియలేదు. యెల్లుండి వెళ్ళేకంటే రేపు [illegible] మంచిదనుకొన్నాను. నేను వచ్చిన [illegible] (అది మీకు చెప్పదల్చలేదు) [illegible] కొన్నాను. యే మూల వినబోయినా [illegible] నాదం! యెటుచూడబోయినాలంచగొండి తనం,నిరుద్యోగం,బ్లాకుమార్కెట్టు,[illegible] సులు, దరిద్రం గుద్దులాడి చూస్తున్నాయి. ఏమిటీమందు?

"ఇంతకీ సుబ్రమణ్యం యెందుకు పోయాడో చెప్పావుకావు" అని అడిగాను. "యెందుకేమిటినాయనా, ఇవాళ ఆదివారం బడిలేదు. రాగిచెంబుతీసుకొని భిక్షానికి పోయాడు. ఈరాత్రి యెక్కడుంటాడో .... యెక్కడంటాడో .... పడుకో యిక...."

బతకలేకపోతే బడిపంతులరాబాబూ అని అనుకున్నాను.

ఇంట్లోపిల్లలు ఆమెనేదో యేడ్పించుతున్నారు. యింకా నిద్రపోకుండా. దొడ్లోంచి కీచురాళ్ళ దీనారావం వినవస్తోంది. మధ్యమధ్య ఒక 'యిలకోడి' వెక్కియేడుస్తోంది. తాతయ్య దగ్గుతూ పడుకొని వున్నాడు. అరుగుమీద దీపపు బుడ్డి విచారంతో సద్దులేకండా యెర్రని కాంతిని వదుల్తూంది

బయటినించి మంచాలుతెచ్చి అరుగు మీద వేసికొన్నాం. అర్ధరాత్రయింది. బయటికారుచీకట్లోంచి బుయ్ మనే నాదం వస్తోంది. చీకటి. కటికచీకటి. అంధకారం. నాకు నిద్రరాలేదు. కళ్ళల్లో ఏదో యినకపెట్టి రుద్దినట్లుగా బాధగావుంది. కణతలమీద నాడి గిజగిజ కొట్టుకొంటూంది. మలేరియా రోగికన్నా నీరసం యెక్కువై నా శరీరం వెచ్చని గాలి వదుల్తోంది. నన్నుని ఝల్లుమనిపించే చలిగాలి బయటినించి రాసాగింది.

ఎన్నో ఆలోచనల్తో కిందుమీదు అవుతూ కొంచెం మగతగావుంది నాకని. ఇంతలో యెవరో వచ్చారు. నామంచం వద్ద నుంచున్నారు. నా ముఖంలోకి చూస్తున్నారు. ఆ చూపు తీక్షణతకి కళ్ళు నులుముకొని చూసేను. సుబ్రమణ్యం ఖద్దరు లాల్చీ రాగిచెంబుతో వున్నాడు. నలభైయేళ్ళకే వడిలిపోయిన ముఖం. చప్పిబుగ్గలు. యెత్తైన దవుడయెముకలు. దించుకుపోయిన కళ్ళు. నన్నుని మెదపీటితో వున్నాడు నా మిత్రుడు. కాని యేదో దీక్షను చూపుతూన్న దృష్టితో నా మిత్రుడు — కాంగ్రెసువాది—బతక లేక బడిపంతులయినాడు. 'ప్రజారాజ్యం'లో దరిద్రంలో మునకలేస్తూ నా వంక చూస్తూన్నాడు.

సోవియట్ రష్యాలో మాజీ సైనికులకు దివ్యాదరణ

1939లో ప్రారంభమయిన రెండవ ప్రపంచ మహాయుద్ధం 1945 మధ్యలో ముగిసింది. ప్రపంచాన్నంతా తమ దోపిడీ పరిపాలన క్రిందకు తెచ్చుకుందామని కలలుగని లక్షసవర్యలకు దిగి సర్వనాశనానికి దారితీసిన జర్మన్, జపాన్, ఇటలీ ఫాసిస్టు ప్రభుత్వాలు తుడుచుకుపోయాయి. ప్రపంచాన్ని ఈ ఫాసిస్టు బానిసత్వం జారిపడకుండా అహర్నిశలు! ప్రాణాలను సహితం తెగించి, తమ తమ మాతృదేశరక్షణకు, ప్రజాస్వామిక ప్రభుత్వాలను కాపాడటానికి త్యాగం చేసిన కోటానుకోట్ల వీరయోధులకు ప్రపంచ ప్రజాకోటిఋణపడివుంది.

యుద్ధం ముగిసింది. యుద్ధకాలంలో పెంచబడిన సైన్యాలు శాంతికాలంలో అనవసరం. అందుచేత సహజంగా శాంతి సైన్యానికి కావలసిన వారినివుంచి, మిగతావారినందరిని ప్రభుత్వాలు సైన్యాల నుండి విడుదలచేశాయి. చేస్తున్నాయి. యుద్ధకాలంలో శత్రువుతో ఢీకొంటానికి మందుగుండుసామానులాగ వాడబడిన మాజీసైనికులు విడుదల చేయబడగానే కొన్ని దేశాలలో దేనికీ పనికిరానివారై పోతున్నారు. దానికి మన భారతదేశమే తార్కాణం.... ప్రపంచ ఫాసిస్టు శక్తులను దునుమాడి, యుద్ధంలో దాదాపు 70 లక్షలమందిని కోల్పోయి ప్రజల స్వాతంత్ర్యాన్ని నిలబెట్టిన సోవియట్ రష్యా తన వీరపుత్రులను, వీరనారీమణు లను సాటిలేని ఆదరణతో గౌరవించింది: కాపాడింది. ఈ చిన్న వ్యాసంలో యీ రెండు దేశాలలో మాజీసైనికుల స్థితిగతులు వివరించబడ్డాయి.

భారతదేశంలో

యుద్ధానంతరం సైన్యంనుండి విడుదల చేయబడినవారు 10 లక్షలకు మించరు. యుద్ధనిర్వహణకు తోడ్పడిన పరిశ్రమలనుండి, యితర కార్యక్రమాలనుండి యింకా దాదాపు 50 లక్షల వరకు విడుదల చేయబడుతున్నారు. వీరిమీద ఆధారపడిన కుటుంబాలతోగూడ అంచనావేస్తే భారతదేశము యుద్ధానంతరం రెండుకోట్లపైగా ప్రజలు నిరుద్యోగరాక్షసి కౌగిలిలో పడబోతున్నారు. ఆరేండ్లు యుద్ధసేవతర్వాత వీరికినాడు స్థావాలు లేవని పట్టణ వీధులలో ఉద్యోగాలకొరకు, తిండికొరకు ముష్టెత్తుకొనే దుర్దశకు పాల్పడుతున్నారు, విపరీతమైన ధరలు, అవసరమైన దినుసులు బ్లాకుమార్కెటు - యిక నిరుద్యోగుల సంగతి వర్ణించ తరంగాదు. అయితే నిరుద్యోగులకు మాజీసైనికులకు భారత ప్రభుత్వం ఏం సహాయంచేస్తుంది? వీరి కందరికి ఎలా పని కల్గిస్తుంది?

కావు. బ్రతుకులకు వెరవకుండా భార్యా బిడ్డలను, కనిపెంచిన తల్లిదండ్రులను వీడి యుద్ధరంగాలలో మారణ ఆయుధాలకు గురయి, దేశాన్ని జపాన్ రాక్షసుల పాలుగాకుండా రక్షించడానికి తమ ప్రాణాలను, రక్తాన్ని ధారవోసిన యువవీరులను నేడు భారత ప్రభుత్వం నిరుద్యోగాన్ని—కాదు ఆకలిమంటలను పారితోషికంగా యివ్వచూస్తోంది. ప్రతి దేశభక్తుడూ తీవ్రంగా ఆలోచించవలసిన గడ్డు సమస్య యిది.

భారత ప్రభుత్వం మాజీసైనికులకు పనులు కల్పించాలనే పవిత్రాశయం కలిగివుంది ఒక్తానలో-అంతే. ఈపనులు చేస్తున్నామని లక్షలాది ప్రజా ద్రవ్యాన్ని దుర్వ్యయం చేస్తున్న మాట వాస్తవమే అయితే ఫలితం రెండేండ్లుగా ఉద్యోగాలు కల్పించటానికి ఏర్పాటుచేసిన డిపార్టు మెంటుద్వారా నూటికి 10 గూడా వుద్యోగాలు దొరకలేదు.

మొట్టమొదటిసారిగా రీసెటిల్‌మెంటు ఎంప్లాయిమెంటు డిపార్టుమెంటును

భారతదేశంలో యమయాతనలు

1945 జూలైలో భారత ప్రభుత్వం ఏర్పరచింది. అసలు యిదొక శాఖ ఉంటూ ఒకటుందని భారత కార్మికసంఘాలకు తర్వాత సంవత్సరానికిగాని తెలియలేదు. కార్మికసంఘ ప్రతినిధులతో మాజీ సైనికులకు ఉద్యోగాలు కల్పించే వ్యవహారం చర్చించటానికి ప్రథమసమావేశం 1947 జనవరిలో జరిగింది. చూడండి, ఎంత వేగంలో పనులు నడిచాయో!

ఇక 1945 జూలైనుండి ఈ డిపార్టుమెంటు చేసిన కృషి—

(1) సైన్యంనుండి విడుదల కాబడిన 10 లక్షలమందిలోనూ వివిధ కేంద్రాలలో 4,00,000మందిని (అంటే సగానికి తక్కువగా) రిజిష్టరు చేశారు. వీరిలో యీ యిరవై నెలలలోను వుద్యోగాలు యిప్పించబడినవారు షుమారు 80,000. అయితే యీ సంఖ్యలో కార్మికుల సమ్మెలను విచ్ఛిన్నం చేయటానికి కొంతభాగం వినియోగపరచారనేది పాఠకులు మరువరాదు.

(2) ఈ కాలంలో వివిధవృత్తులలో ట్రయినింగు యిప్పించటానికిగాను 11178 కి తరిఫీదు నివ్వగల 98 కేంద్రాలను తెరిచారు. కాని యిప్పుడు 6000 మాత్రం తరిఫీదు పొందుచున్నారు.

(3) వికలాంగులై రిజష్టరు చేసిన వారి సంఖ్య 49000. వీరిలో వీరి శరీర దారుఢ్యాన్నిబట్టి చేయగల పనులలో తరిఫీదు 1941 మంది మాత్రం పొందు తున్నారు. ఉద్యోగాలు దొరికినవారు 673 మాత్రమే.

ప్రభుత్వం యిప్పించిన వుద్యోగాలు 80 వేలు చిల్లర. వుద్యోగాలు కావలసిన మాజీసైనికులు 10 లక్షలు!

తక్కినవారంతా గ్రామాలలో, పట్టణాలలో బ్రతుకుతెరువు గానక, ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజి ఆఫీసులచుట్టూ తారట్లాడుతూ, ఆర్ధాకలితో అలమటిస్తున్నారు అర్థరు "ఇదిగో వస్తుంది, అదుగో వస్తుంది" అని తిప్పటంతో విసుగెత్తి దిగజారిపోతున్నారు. కాగితాల స్కీములు తయారుచేయటం, అవి బాగుగాలేవని మరొకశెట్టు తయారు చేయడం మినహాగా, యీ మాజీ సైనికుల సమస్యను పరిష్కరించటానికి ప్రభుత్వం ఏమి పని చేయటంలేదనే చెప్పవచ్చు.

భారతీయులకు కావలసిన సరుకుల ఉత్పత్తి తక్కువ. బట్టలు దొరకటం లేదు. ఆహారదినుసులు తక్కువ. నివసించటానికి యిండ్లుసహితం లేవు. అలాంటి భారతదేశంలో భారీపరిశ్రమలను స్థాపించటానికి, గృహ నిర్మాణానికి పూనుకోవడానికి, బంజరు భూములను సాగులోనికి తేవటానికి, నూతన యంత్రాగారాలు నిర్మించటానికి, రైలు, రోడ్డు సౌకర్యాలు అభివృద్ధిచేయడానికి ఎన్నో అవకాశాలున్నాయి. ఇవన్నీ తలపెడితే, యీ మాజీసైనికులు బాలరు, యింకా ఎన్నో లక్షలమందిని పరిశ్రమలకు రప్పించాలి. కాని యీ ప్రయత్నం చేస్తున్నవారుగాని, యీ రెండు కోట్ల జీవితాలనుగాని లెక్కచేస్తున్న ప్రభుత్వ నాయకులుగాని అరుదనే చెప్పాలి.

ఉద్యోగాలు లేవు. నిరుద్యోగ అలవెన్సులేవు. అప్పులు తీరలేదు. దరిద్రం తాండవిస్తూంది. ఎటుచూచినా నిరుత్సాహం, ఆకలి మంటలు, దుర్భర దారిద్ర్యం - ఇవి నేటి భారతదేశ మాజీ సైనికునికి ప్రత్యక్షమయేవి.

సోవియట్ రష్యాలో

యుద్ధంలో ప్రధానపాత్ర వహించిన కార్మిక కర్షక ప్రభుత్వమైన సోవియట్ రష్యావైపు చూడండి. ఏనాడో నిరుద్యోగ పిశాచాన్ని పారద్రోలి, భూతల స్వర్గాన్ని సృష్టించిన అజేయ సోవియట్ రష్యాలో మాజీ సైనికుడు యుద్ధ వీరుడుగా ఆదరణ పొందుచున్నాడు. మిలిటరీ దుస్తులు విడుస్తూండగానే, పౌరజీవితానికి వచ్చేముందుగానే, ఆఫీసునుండి బయటపడే క్షణంలోనే ఉద్యోగం వెంటాడుతునేవుంది. ఉద్యోగాలకోసం అతడు తిరగనక్కరలేదు. వుద్యోగాలే వెతుక్కుంటూ తిరుగాడుచున్నవి.

నాలుగేండ్ల యుద్ధంలోను సోవియట్ రష్యా అతీతమైన నష్టాలకు గురైంది. యంత్రాగారాలు నాశనమయాయి. వ్యవసాయ క్షేత్రాలు పండించ వీలులేకుండా తయారైనాయి. లక్షలాది ఇండ్లు దగ్ధం

టి. వెంకటేశ్వరరావు

చేయబడ్డాయి. మొత్తం నష్టం కొన్ని లక్షల కోట్ల రూపాయలను మించి పోయింది. ఈలాంటి నష్టాన్ని భర్తీ చేసుకోవాలి. దేశాన్ని దాని పూర్వపు స్థాయికి తేవాలి. ప్రజలకు కావలసిన సౌకర్యాలు కల్గించాలి అని దృఢదీక్షతో, బోల్షివిక్ పట్టుదలతో మరొక పంచవర్ష ప్రణాళికను అమలులో పెట్టారు. ఈ ప్రణాళిక ప్రకారం కార్యక్రమం పూర్తి గావాలంటే, రష్యాలోని పనిచేయగలి గినవారంతా చేసినా చాలరు. ఇంకా మనుషులు కావలసినవస్తారు.

యుద్ధం అయిపోతూండగానే సోవియట్ ప్రభుత్వం మాజీ సైనికులను గురించి ఒక ఆర్డరు జారీచేసింది. పట్టణాలకూ, గ్రామాలకు తిరిగివచ్చిన మాజీ సైనికులకు ఆయా ప్రాంతాల అధికార సంస్థలు 30 రోజులలో ఉద్యోగం విధిగా యిచ్చితీరాలి. అదైనా వారి వారి నేర్పరితనం, నిపుణత్వాన్నిబట్టి వృత్తి కల్పించాలి ఏపరిస్థితుల్లోనూ అతడు 1941లో తాను పొందే వేతనంకంటె యిప్పుడు తక్కువ పొందరాదు. మాజీ సైనికుల యిబ్బందులు తీర్చటానికి, వారి గృహాలు బాగుచేసుకోటానికి, లేక తిరిగి నిర్మించు కొనటానికి కావలసిన ఆర్థిక సహాయం చేయాలి. ఆరోగ్యం కోల్పోయినవారికి ఆరోగ్య సదనాలలో మందు అవకాశం యివ్వాలి.

ఈ ఆర్డరు ప్రకారం దేశవ్యాపితంగా మాజీ సైనికులకు సకల సౌకర్యాలు జరుగుచున్నవి. మాజీ సైనికులు తమ వృత్తులలో ప్రావీణ్యతను సంపాదించు కొనుటకు ట్రైనింగు సెంటర్లు ఏర్పాటు చేయబడ్డాయి. మాజీ సైనికులు తమ నైపుణ్యంతో దేశ క్షేమానికి, ప్రజా ప్రయోజనాలను దృష్టిలోపెట్టుకొని పారిశ్రామిక వస్తువులను రెండుమూడు రెట్లు ఎక్కువ ఉత్పత్తిచేయటానికి కావలసిన ఉత్సాహం, సహాయం ప్రత్యక్షంగా పొందుతున్నారు.

ఈ ఆదరణ, ప్రోత్సాహం, సహాయం పారిశ్రామిక రంగంలోనే గాదు. వ్యవసాయక్షేత్రాలలోకూడా అంతే. గ్రామ సోవియట్ మాజీ సైనికులకు యిండ్లు బాగుచేసికొనటానికి, తమ సంసారాలను కుదుటబెట్టుకొనటానికి, తమతోపాటు క్షేత్ర పరిపాలనలో పాల్గొనటానికి సర్వఅవకాశాలు గలిగించారు. ఉచితంగా కలప, సమిష్టిగా అందరు తోడ్పడటం, ఆర్థికసహాయం చేయటం అమితోత్సాహంగా సాగిపోతుంది.

పారిశ్రామిక, సమిష్టిక్షేత్రాల ప్రాంతాలలో 1947 ఫిబ్రవరి 10 న జరిగిన సుప్రీం సోవియట్ ఎన్నికలలో ధైర్య సాహసాలతో మాతృదేశ రక్షణకు పూనుకొన్న అనేకమంది మాజీసైనికులను డిప్యూటీలుగా ఎన్నుకొన్నారంటే ప్రభుత్వం, ప్రజలు చూపెట్టేశ్రద్ధ మనం తెలుసుకోవచ్చు.

విద్యాసౌకర్యాలు

పరిశ్రమల్లో, సమిష్టి వ్యవసాయ క్షేత్రాలలో, ఇతర జాతీయ పునర్నిర్మాణ కార్యక్రమాల్లో ఉద్యోగాలివ్వటమేగాదు యుద్ధానికిపూర్వం విద్యార్థులుగా వుండి, మిలిటరీలోనికివెళ్ళి తిరిగివచ్చిన వారంతా తిరిగి తమవిద్యను కొనసాగించుకుంటున్నారు. కొత్తవారుగూడ తమతమ అభిరుచులనుబట్టి, తమ ప్రావీణ్యతను పెంపొందింప చేసుకొనటానికి టెక్నికల్ కాలేజీలలో యితర కేంద్రాలలో విద్యనభ్యసిస్తున్నారు. యిలా విద్యనభ్యసించు మాజీసైనికులు 100000కు మించి పోయారు. యీసంవత్సరంలో యింకా కొన్నిరెట్లు పెరుగుతూంది. అయితే యీచదువులు సాగించటానికిగాని, టెక్నికల్‌విద్య నేర్చుకొనటానికిగాని మాజీసైనికులు దమ్మిడీ ఖర్చుపెట్టనక్కరలేదు. కావలసిన వసతులన్నీ ప్రభుత్వం ఉచితంగా చేయటమేగాక, కుటుంబ అలవెన్సులుసహితం యిచ్చి పోషిస్తుంది.

ఈవిధంగా ప్రభుత్వ సహాయంతో లక్షలాది మాజీసైనికులు తమవిజ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నారు. దేశ ఆర్థిక పరిశోధనా శాఖలలో వీరు ఎంతో ఉపయోగపడుతున్నారు.

వికలాంగులకు

వికలాంగులైన మాజీ సైనికులు తక్కినవారిలాగా పనిలో ప్రవేశించలేరు విద్యనభ్యసించ నుత్సాహం లేనివారు ఉన్నారు. పొత్తిగా ఏకంగాను పని చేయలేనివారికి శాశ్వతపెన్షన్లు ప్రభుత్వం యిస్తుంది. ఇలా పెన్షన్లు యివ్వటానికిగాను 1947-1948 సంవత్సర బడ్జటులో 2650 కోట్లు రూపాయలు ప్రత్యేకించారు. యిలా ప్రతినెలా యిచ్చే పెన్షన్లుగాక, గతసంవత్సరం తమ కుటుంబాలను దక్కబెట్టుకొనటానికి గ్రాంటుల రూపముగా ఒక్క రష్యన్ రిపబ్లిక్‌లోనే 25 కోట్ల రూపాయలు యిచ్చారు. వీరు పన్నులు చెల్లించనక్కరలేదు. ఆరోగ్య సదనాలలో ప్రత్యేక సౌకర్యాలు, సహకారసంస్థలలో వీరికి తగ్గింపుధరలకు వస్తువులు అమ్మఏర్పాట్లు చేశారు.

అయితే మరొకవిషయముంది. ఎల్ల కాలమూ [illegible] లాంగులైనవారు సమాజంలో ఒక బరువుగా తయారవుతారు. అందుకే వారిలో

ఎవరెవరి శరీర దారుఢ్యాన్నిబట్టి వున్న అవయవాలను దృష్టిలోవుంచుకొని వారికి తగినవృత్తులు నేర్పుతున్నారు. యీ విధంగా తరిఫీదుపొంది ఉద్యోగాలు సంపాదించినవారి సంఖ్య నూరుమంది వికలాంగులలోను 80మందికి మించింది. యింకా తరిఫీదు పొందుచున్నవారిసంఖ్య 70000 వరకు వున్నారు. యీరకంగా వేతనాలు పొందేవారు యుద్ధానికి పూర్వం కంటె నూటికి 20 వంతులు ఎక్కువ సంపాదిస్తున్నారు.

సహకారసంస్థలను స్థాపించి ప్రజోపయోగకరమైన వస్తువుల ఉత్పత్తిసాగిస్తున్నారు. ఈవిధమైనపనులుసాగించే సహకార సంఘాలు యిప్పటికప్పుడే 25000 స్థాపించారు. వీటిలో యితరులతో పాటు 40,000 వికలాంగులుకూడ పని చేస్తున్నారు. వీరు సాధారణ వేతనాలు పొందుటయేగాక, సహకార సంఘాలలో వచ్చే లాభాలు పంచుకుంటారు. తరిఫీదు కాలంలో ప్రభుత్వం ఉచిత యేర్పాట్లు కుటుంబాలకు అలవెన్సులు గ్యారంటీగా యిచ్చింది. అనారోగ్యంగా ఉన్నప్పుడు సహాయానికిగాను ప్రత్యేక భీమాపద్ధతి ప్రవేశపెట్టబడింది. ఆరోగ్యసదనాలు, వందలాది విశ్రాంతి గృహాలు వీరికొరకు నిర్మించబడినాయి.

సోషలిస్టు సమాజంలో ప్రతి మనిషికి జీవితం సౌఖ్యవంతంగా గడపటం కొరకు సోవియట్ ప్రభుత్వం కావలసిన ఆహార, వస్త్ర, గృహ సౌకర్యాలను ఏర్పరచటానికి మాజీసైనికులు ఎంతో ఉపయోగపడుతున్నారు. విడుదల సర్టిఫికెట్టు పుచ్చుకుంటుండగానే, "మా ఫ్యాక్టరీకి మా వ్యవసాయక్షేత్రానికి" అని అనేకసంస్థలు ఉద్యోగాన్ని అందించుతున్నాయి. విజ్ఞానాన్ని పెంపొందించుకొనటానికి, వృత్తులలో నైపుణ్యం సాధించుకొనటానికి, వికలాంగులయిన వారికి వారి నిజవనుబట్టి వృత్తులు కల్పించటానికి, పెన్షన్లు ఇవ్వటానికి సోవియటుప్రభుత్వం తీవ్రంగా కృషిచేసింది. ఫాసిస్టుమూకల నుండి దేశాన్ని కాపాడిన వీరపుత్రులను పుత్రికలను గౌరవించటంలో, ఉత్సాహ పరచటంలో దానికి దేనాటి

పెట్టుబడిదారీ దేశాలలో మిలటరీ నుండి విడుదలచేస్తే, నిరుద్యోగంపెరుగుతుంది. విడుదల చేయకపోతే, వీరిని పోషించటానికి ప్రజలు ఎక్కువపన్నులు చెల్లించాలి. అంతేగాదు. సామ్రాజ్యవాద భావాలు పెరిగిపోయి, మళ్ళీక్రమముగా తిరిగి యుద్ధానికి దారితీస్తాయి.

'నేడు కేంద్రంలో అధికారంలోవున్న జాతీయప్రభుత్వం, ప్రజా మంత్రివర్గాలు అధికారంలో వున్న రాష్ట్రప్రభుత్వాలు పదిలక్షలమంది మాజీ సైనికులనేగాదు; నిరుద్యోగ పిశాచానికి దేశవ్యాపితంగా బలికానున్న మరొక 50 లక్షల కార్మికులను, వారి కుటుంబాలను మాడిపోకుండా కాపాడాలి. దేశసౌభాగ్యానికి, వస్తువుల కొరతను తీర్చటానికి ఉపయోగపడే పరిశ్రమలను నెలకొల్పడంద్వారా, జమీందారీ విధానాన్ని రద్దుచేసి కోటానుకోట్ల యకరాలను సాగులోనికి తేవటంద్వారా వీరందరికీ - పని కల్పించవచ్చు. ప్రజా ప్రభుత్వాలకు యిదొక అగ్నిపరీక్ష. యీ అగ్నిపరీక్షలో ప్రజా ప్రభుత్వాలు నెగ్గలేకపోయాయంటే, దేశంలో కోటానుకోట్ల నిరుద్యోగుల హాహాకారాన్ని, ఆర్థికసంక్షోభాన్ని ఎదుర్కొవలసి వస్తుంది.

ప్రజాశక్తి చందా

సంవత్సరం చందా	రు. 24—0—0
విడిపత్రిక	0—1—0
వారపత్రిక సం॥ చందా	3—0—0
వారపత్రిక	0—3—0

కూడుకోసం, గుడ్డకోసం, జీవితావుసరవస్తువులకోసం

మే నెల మొదటి వారంలో బ్రహ్మాండంగా ఆకలి యాత్రలు సాగించండి

జమీందార్ల, మిల్లు యజమానుల, బ్లాక్ మార్కెటుదార్ల నిరంకుశోద్యోగుల చర్యలను అరికట్టాలని విజ్ఞప్తులు అందించండి

ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిస్టు కమిటీ

ఆహారం, బట్ట, పంచదార, అగ్గిపెట్టెలు మొదలయిన జీవితావసర వస్తువుల కొరకు ప్రజలు నానాబాధలు పడుతూ ఉన్నారు. యుద్ధంపూర్తి అయి షుమారు రెండు సంవత్సరాలు అయినప్పటికీ, జీవితావసర వస్తువుల కొరత తగ్గుటకు మారుగా నానాటికి ఎక్కువ అవుతూ ఉంది. ధరలు విపరీతంగా పెరిగి పోతూ ఉన్నవి.

తిండికొరత

రాయలసీమలో, ముఖ్యంగా కర్నూలు, కడప జిల్లాలలో, ఈసంవత్సరం పంటలు సరిగా పండలేదు. ధాన్యం నిల్వచేసుకు కూర్చున్న పెద్ద భూస్వాములు బ్లాకుమార్కెట్టులో అధిక ధరలకు అమ్ముతున్నారు. జొన్నలు కంట్రోలురేటు పుట్టికి రు 240 లు అయితే 470, 750 లకు అమ్ముతున్నారు. బియ్యం రూపాయికి శేరు గూడా దొరకుట లేదు. అందువల్ల బీద రైతులు, కూలీలు, పట్టణప్రజలు తిండిలేక నానాబాధలూ పడుతున్నారు.

బాగా ధాన్యం పండే కృష్ణా, గోదావరి డెల్టా జిల్లాల్లో సైతం అధికవర్గాలవల్లపంటలు తగ్గినవి. ఈజిల్లాల్లోని మెట్ట ప్రాంతాలలోని ప్రజలు తిండిగింజలు దొరకక బాలబాధపడుతున్నారు. ధాన్యం బస్తా రు 20 నుండి 40 వరకూ అమ్ముతూఉంది. మాగాని ప్రాంతాల నుండి ధాన్యం బ్లాకు మార్కెటుద్వారా మెట్ట ప్రాంతాలకు పోతూఉంది. ఇందువల్ల మెట్ట ప్రాంతాలకు దగ్గరగావున్న మాగానిగ్రామాల కూలీలకుగూడ గింజలు దొరకడంలేదు. బ్లాకుమార్కెట్టు ఈవిధంగానే విజృంభించితే డెల్టా ప్రాంతాల కూలీలుగూడ తిండిగింజలకు అవస్థపడే రోజులు వస్తాయి.

'ఆహార కొరత ఈ సంవత్సరమేగాదు. 1942 నుండీ ప్రతి సంవత్సరం ఏర్పడుతూనే ఉంది. కారణం ఏమిటి? మన దేశం ప్రధానంగా వ్యావసాయిక వస్తువులు పండించేదే అయినప్పటికీ, ఏటేటా బర్మా, సయాం నుంచి బియ్యం ఎగుమతి చేసుకొనేది 1944 లో బర్మా, సయాం, మొదలైన దేశాలను జపాను ఆక్రమించటంతో బియ్యం దిగుమతులు ఆగిపోయినవి. ఈ అవకాశాన్నుపయోగించుకొని దురాశాపరులైన వర్తకులు బ్లాక్‌మార్కెటును సృష్టించారు. బెంగాలు, బీహారు, ఒరిస్సా, మలబారు, ఆంధ్రదేశంలో రాయలసీమ, విశాఖపట్నం జిల్లాల్లో షుమారు 50 లక్షల ప్రజలను తమ పొట్టన పెట్టుకున్నారు. మిగతా ప్రజలను, బ్రతికివున్నా బలహీనులను చేశారు.

పుష్కలంగా తిండి, ధాన్యం కావాలంటే జమీందారీవిధానం రద్దుకావాలి

అసలు మన దేశం ఆహారవస్తువులకు ఇతర దేశాలమీద ఆధారపడవలసిన అవసరం ఏముంది? కారణం రైతులను కూలీలను పీల్చి పిప్పిచేస్తున్న బ్రిటిష్‌సామ్రాజ్యవాదుల దోపిడీ. వారిచే సృష్టింపబడిన జమీందారీవిధానమే. సాగుకు లాయకైన భూమి చాల భాగం జమీందార్లు, పెద్ద భూస్వాములు ఆక్రమించుకు కూర్చున్నారు. వారు రైతులవద్ద నుండి అధిక కౌళ్ళు గుంజుతారేగాని, భూమి బాగోగులను కనుక్కోరు. జమీందార్లు సాగుకు లాయకైన వేలకొద్ది యకరాలను బీడుభూములుగా ఉంచారు. రైతులవద్ద హద్దు లేని అధిక శిస్తులు గుంజుతారేగాని, చెరువులు కాల్వలను మరమ్మతు చేయించరు. ఇందుచేత ఆహార వస్తువుల పంట అవసరమైనంత పండక, శాశ్వత కరువు ఏర్పడింది.

పంటల తరుగుతో జమీందార్లకు, పెద్ద భూస్వాములకు బ్లాకుమార్కెట్టు వర్తకులు తోడయ్యారు. వీరు రైతుల వద్దనుండి చౌక ధరలకు పంటను చేజిక్కించుకొని, కృత్రిమ కరువును సృష్టించి, విపరీత లాభాలను తీస్తున్నారు.

మద్రాసు రాష్ట్రంలో కాంగ్రెసు మంత్రివర్గం అధికారాన్ని స్వీకరించి సంవత్సరం పూర్తి అయిపోయినప్పటికీ జమీందారీ సమస్యను సమగ్రంగా పరిష్కరించడానికిగాని, బ్లాకుమార్కెటును నిర్మూలించి కరువును తాత్కాలికంగా అరికట్టడానికిగాని పూనుకోలేదు. ఎన్నికలలో కాంగ్రెసు నాయకుల వాగ్దానాల నన్నిటినీ బుట్టలోపెట్టింది. జమీందార్లకు, పెద్ద భూస్వాములు, బ్లాకుమార్కెటు వర్తకులకు అండగా నిలిచింది. నిరంకుశోద్యోగివర్గానికి రైతు-కూలీ ఉద్యమాలను అణచివేయడానికి వారికి పూర్తి స్వేచ్ఛ నిచ్చింది. చివరకు గవర్నరుతో కలిసి ప్రజారక్షణ చట్టాన్ని ప్రయోగించి, ప్రజలమీద తీవ్ర నిర్బంధవిధానాన్ని అమలుజరుపుతూ వుంది. షుమారు 2500 మంది ప్రజాసేవకులను జైళ్ళలో కుక్కింది.

జమీందారీ విధానం రద్దు చేయడానికి ఆలస్యమవుతుందనే సాకుతో, జమీందారీ శిస్తులు తగ్గించే బిల్లును పెట్టారు. కాని దీని వల్ల ఆహార సమస్యా పరిష్కారం మాత్రం ఏమీగాదు.

ధాన్యం ధరల అవకతవకలు

అయిదు డెల్టా జిల్లాలోని ధాన్య సేకరణ ప్రయివేటు వర్తకులు మిల్లు యజమానుల చేతుల్లోనుండి తీసివేయబడింది. అందుకు ఉత్పత్తి కొనుగోలుదార్ల సంఘాలను స్థాపించ దానికి నిర్ణయించబడింది. కాని ఆ సంఘాలు సామాన్య రైతు కూలీల అందుబాటులో లేని విధంగా ఏర్పరుపబడినవి. వాటికి ఎన్నికలు లేకపోవడం, డైరెక్టర్లను పైనుండి నిరంకుశోద్యోగులు నిర్ణయించడంవల్ల ఇవిగూడ మిల్లు యజమానులు, వర్తకులు, పెద్ద భూస్వాముల పెత్తనంక్రిందికే పోయాయి. వీరు తమ ధాన్యాన్నిదాచుకుంటూ సామాన్య రైతుల ధాన్యాన్ని సేకరించుటకు పూనుకుంటున్నారు. పైగా ధరలు చూదామా అంటే నిరుటికన్నా చాలాతక్కువ. నిరుడు ముతక బియ్యం ధర బస్తాకు రు 24-8-0 నిర్ణయింపబడ్డప్పుడే ముతక ధాన్యానికి బస్తాకు మిల్లుకు చేరా రు 10-7-0 నిర్ణయింపబడింది. అటువంటిది యీ సంవత్సరం బియ్యం ధర రు 25—5—0 కు పెంచిగూడ, ధాన్యం ధర రు 10—0—0 లకు తగ్గించబడటం హాస్యాస్పదం. నిరుటి సంవత్సరం బియ్యం ధర వున్నప్పుడే వర్తకునికి న్యాయమైన లాభం పోగా పురివద్ద రైతుకు బస్తాకు రు 11-0-0 ఇయ్యడానికి అవకాశం ఉందని ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం రుజువుచేసింది. ఆట్టిపరిస్థితులలో ఇప్పుడు పెంచబడిన ధర ప్రకారం రైతుకు పురివద్ద రు 11—6—0 యివ్వడానికి అవకాశం ఉంది.

అంతేగాక పై సంఘాలు రైతులనుండి తక్కువ ధరలకు ధాన్యం తీసుకుపోవడానికి వినియోగించబడుతున్నాయిగాని, గ్రామప్రజలకు కావలసిన ఇతర జీవితావసర వస్తువులను, వ్యవసాయపనిముట్లు, ఎరువులు సప్లయి చేయడానికిగాదు. అందుచేత ఈసంఘాలమీద రైతులకు ఏమీ విశ్వాసంలేదు. తమలో చీలికలు పెట్టి తమనుండి చౌకగా ధాన్యం తీసుకుపోడానికి ఉద్దేశించబడిన సాధనాలుగానే వీటిని భావించుతున్నారు. అందుచేత ఈసంఘాలకు ధాన్యంఅమ్మటానికి రైతులు నిరాకరించుతున్నారు. కాని ధాన్యసేకరణ స్థంభించిపోయింది. కొరత ప్రాంతాలలో ప్రజలకు బియ్యం దొరకక పస్తులుంటున్నారు. పట్టణాలలోని రేషనింగు దెబ్బతినేస్థితికి వచ్చింది. రైసుమిల్లులు మూతబడుటచే, ఆంధ్ర దేశ కార్మికులు నిరుద్యోగ రాక్షసి పాలిట బడనున్నారు.

నిర్బంధ ధాన్యసేకరణ

ఇది ఇల్లుండగా కొత్తమంత్రివర్గం వచ్చీ రావడంతోనే, ఆహారసమస్యను సమగ్రంగా పరిశీలించి పరిష్కార మార్గానికి పూనుకోడానికి బదులు, రాష్ట్రంలోనిఅన్నిజిల్లాల రైతుల నుండి ధాన్యం, జొన్నలు సజ్జలు, రాగులు మొదలయినవాటి సేకరణ నిర్బంధ విధానాన్నుపయోగించిగూడ సాగించుతామని ప్రకటించింది. ఉత్పత్తి కొనుగోలుదార్ల సంఘాలను స్వార్థపరుల చేతుల్లోనుండి తొలగించి ప్రజాస్వామ్యపద్ధతులమీద పునర్నిర్మించడానికి బదులుగా, మిల్లుయజమానులకు ధాన్య సేకరణ అప్పజెప్పే అధికారం జిల్లా కలెక్టర్లకిస్తూ ఆర్డరు జారీచేసింది. అసలు ఉత్పత్తి కొనుగోలుదార్ల సంఘాలనే మూలబెట్టి, ధాన్యసేకరణను నేరుగా మిల్లు యజమానుల, వర్తకుల చేతుల్లో పెట్టే సూచనలు కన్పిస్తూ ఉన్నవి రైతుకు ఎంత ఆహారం అవసరమో ఏర్పేటింగ్ ఆఫీసరే ఇకముందు నిర్ణయిస్తాడంటూ ఒక ప్రకటన ఇప్పుడే వెలువడింది. ప్రభుత్వం యొక్క పై విధానంవల్ల రైతులకు న్యాయమైన ధరలు రాకపోవడమేగాక, కరువు ప్రాంతాల ప్రజలకందరికీ, మిగులు ప్రాంతాల్లోని కూలీలకు, పట్టణాలలోని ప్రజలకు కరువు వాతబడే ప్రమాదం వచ్చింది.

నూనెకరువు

ఇక నూనెల ధరలు చూదామా అంటే మండిపోతున్నవి. మంత్రివర్గం వీటి విషయంలో గూడ ప్రజా వ్యతిరేక పంథానే అవలంబించింది. గత మంత్రివర్గం మొదట వేరుశనగకాయకు, నూనెకు కంట్రోలు పెట్టింది. వర్తకుల వత్తిడితో రైతుకు ప్రతికూలంగాను, వర్తకుల కనుకూలంగాను కంట్రోలు ధరను అనేకసార్లు తారుమారు చేసింది. వర్తకులు రైతులవద్దనుండి వేరుశనగకాయను చౌక ధరలకు చేజిక్కించుకున్నారు. చివరకు మంత్రివర్గం అసలు కంట్రోలునే ఎత్తివేసింది. వర్తకులు ఇతర రాష్ట్రాలకు వేరుశనగ నూనెను విపరీత లాభాలకు ఎగుమతి చేస్తున్నారు. వేరుశనగకే పుట్టినిల్లు అయిన ఆంధ్రదేశంలోనే ప్రజలు విపరీత ధరలకు వేరుశనగనూనె కొనుక్కోవలసి వస్తూంది. తలకు కొబ్బరినూనె దొరక్క ప్రజలు ఎంతఅవస్థపడ్డారో యెల్లరకు విదితమే. ప్రభుత్వ పాలసీవల్ల రైతులను, ప్రజలను దోపిడీచేసి, దొంగమార్కెటు వర్తకులు జేబులు నింపుకోవడం జరిగింది.

బట్టకరువు

వంటిమీదకి బట్టలులేక ప్రజలు యిబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా స్త్రీలు మానం దాచుకోడానికి బట్టలు దొరకక అనేక ఇబ్బందులపాలవుతున్నారు. బీద స్త్రీలు పొరుగున్న పేలికలు కట్టలేక ఎలాగో మానం కాపాడు కుంటున్నారు.

మద్రాసుప్రభుత్వం, తల ఒకటికి సంవత్సరానికి పెద్దవాళ్ళకు 5 గజాలు, పిల్లలకు 2½ గజాల మిల్లు బట్ట రేషను నిర్ణయించింది. ఇదైనా బీద ప్రజలకు అందుటలేదు. ఆహార కమిటీల్లోని స్వార్థపరులే చాల భాగం కాజే

ఇక చేనేతబట్టచూదామా అంటే, బీదప్రజలకు ధరలు అసలు అందుబాటులోనే లేవు. యుద్ధారంభంలో రు. 3 పంచలచాపు ఇప్పుడు రు. 12 లకు దొరకడంలేదు. రు. 4 చీరె రు. 18 లకుగూడ దొరకడం దుర్లభమయింది. అయితే ఈ లాభాలన్నీ కష్టపడి నేసే చేనేత పారిశ్రామికునికి దక్కుతుందాఅంటే, లేదనే చెప్పాలి. అతనికి నెలకు 5 రోజులకు సరిపడా నూలు అయినా దొరకక్క, పొట్టచేతో బట్టుకు తిరుగుతున్నారు. బ్లాక్‌మార్కెట్టులో రు. 12 కంట్రోలు రేటువున్న 20 నెం. పెట్టె నూలు. రు. 60, 70 గూడా కొనుక్కోవలసి వస్తూఉంది.

కొందరికి 5 రోజులకు సరిపడే నూలైనా దొరకుటలేదు. చేనేత పారిశ్రామికులకు నూలు సప్లయికి ఏర్పరుపబడిన, సహకార సంఘాలుగూడా స్వార్థపరుల కప్పగించబడినవి.

పోనీ, పత్తిని పండించే రైతులకైనా ఏమైనా లాభం వస్తూవుందా అంటే అదీ కనపడదు. మిల్లు యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన కనిష్టధరలనుగూడ ఇవ్వకుండా రైతులవద్దనుండి పత్తిని కొనేస్తున్నారు.

గుడ్డకరువుకు కారణం ఏమిటి? మిల్లు యజమానులు, వర్తకులు బట్టను, నూలును దొంగమార్కెట్టుకు జేర్చి విపరీత లాభాలు తీయడమే. ప్రభుత్వం ప్రకటించిన లెక్కలను బట్టే బట్టల మిల్లుయజమానులు 1943 సం॥ నాటికే 1938 తో పోల్చిచూస్తే 6½ రెట్లు లాభాలు సంపాదించారు. ఇప్పటికి అది ఎంతకు పెరిగివుంటుందో తెలియదు.

మిల్లు యజమానుల బ్లాక్ మార్కెట్

మద్రాసు రాష్ట్రంలోని మధుర, బకింగ్‌హామ్ ఇంగ్లీషు మిల్లు యజమానుల గుడ్డలోనూ, నూలులోనూ చాలభాగం అసలు రేషనింగులోనే చేర్చబడలేదు వాళ్ళు వాటిని బ్లాకుమార్కెటులో అమ్మి విపరీత లాభాలు తీస్తున్నారు. కాంగ్రెసు మంత్రివర్గం సైతం వీరిని ముట్టుకోడానికి భయపడుతూ వుంది అంతేగాక భారత దేశంలోని బట్టలమిల్లుల యజమానులు, జపాను పతనంవల్ల ఖాళీగా వున్న ఆసియా ఖండంలోని మార్కెట్టును స్వాధీనపరచుకోడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఆశియాలోని యితర దేశాలకు గుడ్డను ఎగుమతిచేసి విపరీత లాభాలను తీస్తున్నారు.

మిల్లు యజమానులు ఇంత లాభాలను సంపాదించుతున్నప్పటికీ, కార్మికులకు కనీస జీవిత నిర్వాహణకు అవసరమైన జీతాలియ్యడానికిగూడ నిరాకరిస్తున్నారు. కార్మికులు తమన్యాయమైన హక్కులు రాబట్టుకోడానికి సమ్మె చేస్తే, గుడ్డకరువుకు సమ్మెలే కారణమని దుష్ప్రచారం చేస్తున్నారు.

కాంగ్రెసు మంత్రివర్గం కార్మికులన్యాయమైన కోర్కెలను మిల్లు యజమానులచే అంగీకరింపజేసి గుడ్డ, నూలు ఉత్పత్తిని అధికంచేయడానికి బదులుగా, కార్మికులమీద తీవ్రనిర్బంధ విధానాన్ని అమలు జరుపుతూ ఉంది. నూలును బ్లాకు మార్కెట్టులోకి పోకుండా అరికట్టి చేనేత పారిశ్రామికులకు తగినంత నూలును సప్లయి చేయడానికి బదులు, వారిని నిరుద్యోగానికి, నూలు బ్లాకు [illegible]

ఉత్పత్తి అయ్యేబట్టను అంతా రేషనింగు విధానంలోనికి తెచ్చి ప్రజలకు తగినంత బట్టను అందించడానికి బదులు బ్లాకుమార్కెట్టుకు వ్యతిరేకంగా పాటుబడే ప్రజాసేవకులను జైళ్ళపాలు జేస్తూవుంది.

ప్రభుత్వం యొక్క పై ప్రజావ్యతిరేక పాలసీవల్ల, బట్టకరువు నానాటికి పెరిగి పోయింది.

ఇతర జీవితావుసర వస్తువుల కొరత

పంచదార, బెల్లం, అగ్గిపెట్టెలు మొదలయిన వస్తువులు సైతం సామాన్యప్రజలకు దొరకుటలేదు. ఉదాహరణకు అర్ధణా అగ్గిపెట్టె రెండు అణాలకుగూడ దొరకుటలేదు.

బట్టలు, పంచదార, అగ్గిపెట్టెలు వ్యవసాయపనిముట్లు మొదలయిన కంట్రోలు వస్తువుల పంపకానికి ఏర్పరుపబడిన ఆహార కమిటీలు, ప్రజలచే ఎన్నుకోబడలేదు. నిరంకుశోద్యోగులచే పైనుండి నిరంకుశంగా నియమించబడినవే. అందుచే అవి చాల వరకు స్వార్థపరులయిన గ్రామపెత్తనదార్లు బ్లాకుమార్కెటు వర్తకుల ఆధీనంలో ఉన్నవి. ఈకమిటీలు కంట్రోలు వస్తువులను తమ స్వార్థానికి ఉపయోగించడం జరుగుతోంది. అందుచే వచ్చే కంట్రోలు వస్తువులు చాలీ చాలకుండా ఉన్నప్పటికీ, అవైనా బీద ప్రజలకు సరిగా అందుటలేదు.

ప్రజల జీవితావసర వస్తువుల సాధనకు మార్గం

తిండి, బట్ట, నూనె, పంచదార, అగ్గిపెట్టెలు మొదలయిన జీవితావసరమైన వస్తువులు ప్రజలందరికీ అందాలంటే, నేడు విచ్చలవిడిగా సాగుతున్న బ్లాకు మార్కెట్టు నిర్మూలింపబడాలి. వాటిని ఉత్పత్తి చేసే రైతులు, కూలీల, కార్మికులకు న్యాయమైన ధరలు అందాలి. స్వార్థపరుల లాభాలు అరికట్టబడాలి. ఉత్పత్తి నిరోధకమైన జమీందారీ విధానం రద్దు చేయబడాలి. భూమి సాగుచేసే రైతులకూ కూలీలకు ఇవ్వబడాలి. జీవితావసర వస్తువుల అధికంగా ఉత్పత్తి చేయబడాలి. వాటిని ప్రజలచే ఎన్నుకోబడిన సంస్థలద్వారా ప్రజలకు పంపిణీ చేయించాలి.

1. ఆహారసమస్యా పరిష్కారం

(అ) సాగుచేసేవానికే భూమి

1. జమీందారీ విధానం వెంటనే ఏవిధమైన "నష్టపరిహారం" లేకుండా రద్దు చేయబడాలి.

2. మాగాని 50 య. తక్కువకానిమెట్టభూమికి పైగా ఎవరికీ ఉండరాదు.

3. జమీందారులు, పెద్ద భూస్వాములు అక్రమంగా రైతులనుండి లాక్కున్నభూమిని సాగుకు లాయకైన బంజరు భూములను బీదరైతులకు, వ్యవసాయకూలీలకు ఇవ్వాలి.

(ఆ) వ్యవసాయాభివృద్ధి

సూచనలు

1. పంట చెరువులు, పంట కాల్వలు మురుగు కాల్వలు ప్రభుత్వం మరమ్మతు చేయించాలి.

2. [illegible] ఉన్న పెద్ద ప్రాజెక్టుల నిర్మాణానికి వెంటనే పూనుకోవాలి.

3. రైతుల [illegible] వ్యవసాయాభివృద్ధికి బాకీ పద్ధతిమీద [illegible] ఇవ్వాలి.

4. వ్యవసాయ పనిముట్లు, ఎరువులు కంట్రోలు ధరలకు [illegible] సప్లయిచేయాలి.

(ఇ) ఆహార వస్తువుల కరువును ఆపడానికి తక్షణకర్తవ్యం

1. ఉత్పత్తి కొనుగోలుదార్ల సంఘాలను ప్రజాస్వామ్యపద్ధతులమీద పునర్నిర్మించాలి.

(మిగతా 8 వ పేజీలో)

నల్లగొండ జిల్లా ప్రజాఉద్యమంలో నూతన దశ

పేదరైతులు, కూలీలు కదులుతున్నారు

రక్తపాతంతో ఉద్యమం అణచడానికి జమీందార్లకు ప్రభుత్వ ఆయుధ సహాయం

నైజాం ప్రభుత్వం నిర్బంధ విధానంతో ఐకమయిన తెలంగాణా ప్రజల శక్తిని చివేయాలని చూసింది. మిలటరీ దాడు ప్రజల ధైర్యవంతమైన పోరాటం వదలి గి పోతారని, నాయకులను పట్టిఇచ్చే కి దిగజారుతారని నైజాం ప్రభుత్వం తల ది. కాని ఈఅంచనా పూర్తిగా తప్పని వయింది

ప్రజల పోరాటం అణచివేసి నాశనంచేయ కి, జమీందారీ నియంతృత్వం స్థిరపరచ కి, తిరిగి ప్రభుత్వం పన్నాగాలు పన్నింది. అవి: (1) రహస్య ఉద్యమ కులను అరెస్టుచేసి ఉద్యమాన్ని తుడిచి టం

(2) ప్రజాపోరాటాన్ని పెత్తురు చేమిలో తడానికి పాయుధ దళాలను సమీక రణం

(3) జమీందారీవర్గాన్ని, వారిరక్షకులైన దళాలను పెంపొందించి సాయుధులను శక్తివంతంగా తయారుచేయడం.

రికారులసంఖ్య హెచ్చించారు

తమ బిడ్డలకు చదువు చెప్పించుకోవడానికి ఫండుకొమ హెచ్చించమనే విరాకరిం ప్రభుత్వం, తానుమ ప్రజల ఉద్యమా క్రమంగా అణచడానికి అధికారుల సంఖ్యను మూడురెట్లు హెచ్చించింది.

...

మాదీ" అంటూ కమ్యూనిస్టు పెనుభూతాన్ని వాళ్ళ కండ్లముందు ప్రదర్శించారు.

ఈ సమావేశంలోనే, కామ్రేడ్స్ రామిరెడ్డి, శశిరేఖ, ప్రియంవదలను అరెస్టు చేయించిన సోనారెడ్డికి ఓ: మెడల్‌ను రాయాక్టార్ ప్రకటించారు. అలాగే రక్షించవలసిన పోలీసు ఉంటారని హామీ యిచ్చారు.

జమీందారీ వర్గానికి ఆయుధాలు

మిలిటరీ దాడులు సాగిన రోజులలో జమీందారీవర్గం తమ లాఠీలతో ఇష్టమొచ్చి నట్లు ప్రవర్తించింది. ప్రజలు అణగిపోయా రని భావించింది. కాని ప్రజలు రాజ్యాధికారంగా అణగియున్నా. తర్వాత సంఘటితమై రౌడీ రాజ్యాన్ని ఎదుర్కొని సాగారు. అందు కని ప్రభుత్వం జమీందార్లకు ఆయుధాలీయ పూనుకొంది

కసాయి పనికై మద్దతు

...

మా రాజకీయవిలేఖరి

కాంగ్రెసు ప్రచారకుల కమ్యూనిస్టు వ్యతిరేక ధ్వజం

తమను నమ్ముకున్న ప్రజలకు తీరోడదరమా?

అక్కడొక మాట, ఇక్కడొకమాట

ప్రజా ప్రతిఘటనలకు విముఖత

జాగృతప్రజల విజృంభణ

పేదరైతు కూలీల కదిలారు

వ్యవసాయకూలీల కదలిక

(మిగతా ప్రక్క పేజీలో)

కమ్యూనిస్టులపై దాడి కార్మికవర్గంపై దాడియే

నిజాం ప్రభుత్వపు మొసలి కన్నీళ్లు ఎవరినీ మోసపుచ్చలేవు

నిర్మాణం, ఐక్యత, పోరాటం ఇవే ప్రభుత్వానికి జవాబు

...స్థాపించుకొన్నారు. కమ్యూనిస్టులువారికినాయకత్వంవహించారు. బొగ్గు, బట్టలు, సిమెంటు ప్రెస్, సిగరెట్, తోలు, ఐరన్ అండ్ స్టీల్, ఎలక్ట్రిసిటీ, ఐటన్. పి. డబ్ల్యు. డి., మున్సిపల్, డ్రైనేజి, టెలిఫోను, వాటర్ వర్క్సు మొదలుగా గల వివిధ పరిశ్రమలలోను సంస్థలలోను, కార్మికులను ఎర్రజెండాక్రింద సంఘటితపరిచారు.

అఖిల హైద్రాబాదు ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్‌కూడా స్థాపించబడింది. ఇందులో 60 వేల హిందూ—ముస్లిం కార్మికులు సంఘటితమై కమ్యూనిస్టునాయకత్వాన నడుస్తున్నారు. దోపిడీ దౌర్జన్యాలనుండి కార్మికులను రక్షించి, కార్మిక హక్కులను సాధించుటకు, తిండి, మంచి జీవిత పరిస్థితులను వారికి కల్గించుటకు, హైద్రాబాదు ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ తీవ్రంగా కృషి చేస్తోంది.

కార్మికవర్గం తన రత్నాల్లాంటి బిడ్డలను పార్టీలో చేర్చింది. పార్టీ మేలే, అణచబడియున్న కార్మికవర్గం మేలు—అని తలచింది కార్మికులకు యూనియన్ కోటలాంటిది పార్టీ చేతిలో అద్దంలాంటిది—అని కార్మికులు తలచారు. అందుచేతనే కార్మికవర్గంలో...

కార్మికులకు ప్రాథమికమైన అత్యంతప్రధానమైనహక్కు. ఈహక్కును సాధించుకొనుటకు హైద్రాబాదు శ్రామికవర్గం ఎన్నియో దౌర్జన్యాలను వహించవలసి వచ్చింది. ఎంతయో త్యాగం చేయవలసి వచ్చింది ఈ హక్కు బ్రిటిషు ఇండియాలో ఎంతోకాలం నుండివుంది ఈహక్కును 1926 లోనే అక్కడ అంగీకరించారు. ఈ మాత్రపు హక్కులనయినా కార్మికోద్యమ బలంవల్లనే ప్రభుత్వం దిగివచ్చి అంగీకరించింది. కాని అవసరమైనప్పుడు హింసా దౌర్జన్యాలతో కార్మికుల నణచడానికి వెనుదీయడం లేదు. ప్రభుత్వం చెప్పేమాటలకు, చేసే చేతలకు చాలావ్యత్యాసంవుంది.

కార్మికుల అధ్వాన్నపుస్థితిగతులు

యుద్ధానికి పూర్వం కూడా కార్మికుల జీతాలు ఎంతో హీనంగా ఉన్నాయి. ఇందుకు ప్రభుత్వం సిగ్గుపడాలి. రాష్ట్రంలో అధిక సంఖ్యాక కార్మికులకు రోజుకు 8 లేక పది అణాకూలి లభిస్తూవుంది కాని బట్టలమిల్లులో స్త్రీ కార్మికులకు నెలకు 6 రూపాయలే. బ్రిటన్ ఫ్యాక్టరీ కుర్రవాండ్రకు నెలకు రు 8 లే జీతం. ఇవి మచ్చుకుకొన్ని మాత్రమే.

కార్మికులపై దౌర్జన్య ప్రయోగం ఈనాటిది కాదు

గుర్రాలలో కార్మికులను త్రొక్కించారు

కమ్యూనిస్టులపై దాడి అంటే కార్మికవర్గంపై దాడియే

ధరలు పెరిగాయి

మఖ్దూం మొహియుద్దీన్

సమ్మె ఆయుధం

చీలికలు కల్పించడం దౌర్జన్య మువయోగించడం ప్రభుత్వవిధానం

నిరంకుశ ప్రభుత్వానిదే నేరం

కార్మికుల పురోగమనం

కార్మికుల కోర్కెలు

(మిగత 8 వ పేజీలో)

(6 వ పేజీ తరువాయి)

ఆహారసమస్యా పరిష్కారం

ఆత్మరక్షణకు సిద్ధపడుతున్నారు

పోరాటాన్ని ప్రజలప్రజాసంస్థలు బలపరచాలి

...

కోడూరుఫిర్కా రైతులపై పోలీసు నిర్బంధాలు

అపుచేయడానికి జిల్లాకలెక్టరు నిరాకరణ

దివి తాలూకా కోడూరు ఫిర్కాలో ధాన్యం కొనేవారు లేక, మార్చి శిస్తీ చెల్లించడానికి రైతులు 15 రోజుల వ్యవధి కోరారు. ఇందుపై ప్రభుత్వాధికారులు రిజర్వు పోలీసును తెచ్చి నిర్బంధంగా శిస్తు వసూళ్ళు సాగించారు. పోలీసులు సాయుధులై రాత్రింబవళ్ళు గ్రామాలవెంట తిరుగుతూ సోదాలు, అరెస్టులు, లాఠీచార్జీలుచేసి ప్రజల్లో భీభత్సం కలిగించారు. ఇందువల్ల రైతులు ఏదివుంటే అది అయినకాడికి తెగనమ్మి శిస్తులు కట్టవలసివచ్చింది. స్థానికాధికారులు తమ దౌర్జన్యాలను సమర్థించుకోడానికి కమ్యూనిస్టులు శిస్తుల నిరాకరణోద్యమం సాగిస్తున్నారని ప్రచారం చేస్తున్నారు.

కోడూరు ఫిర్కాలో యీ సంవత్సరం అధిక వర్షాలతో పంటలు చాల తక్కువ పండినాయి. దానికితోడు ఉత్పత్తి కొనుగోలుదార్ల సంఘాలు తప్ప మరెవరూ ధాన్యం కొనకూడదని ప్రభుత్వం జారీచేసిన ఉత్తరువుల కారణంగా, ధాన్యం కొనేవారు లేక రైతులు నానా యిబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితులను వివరిస్తూ ధాన్యం కొనుగోలు ప్రారంభమయ్యేవరకు శిస్తు వసూళ్లు అపుచేయించవలసినదిగా కోరుతూ దివి తాలూకా రైతుసంఘ ప్రధానకార్యదర్శి కొల్లి శివరామయ్యగారు డిప్యూటీ కలెక్టరుకు మెమోరాండం కూడ యిచ్చారు. కాని ప్రయోజనం లేకపోయింది.

అయినా పరపతి సంఘాలలోను వ్యక్తుల వద్దను దొరికినంత వరకు అప్పులుతెచ్చి జనవరి, ఫిబ్రవరి శిస్తీలు చెల్లించారు. మార్చి 6 వ తేదీన తాసీల్దారు కోడూరురాగా రైతులంతావెళ్ళి తమయిబ్బందులు చెప్పుకొన్నారు. మార్చి శిస్తీ చెల్లించడానికి మరో 15 రోజుల వ్యవధి అడిగారు. ఈ న్యాయమైన కోరికను నిరాకరించడమేకాకుండా తాసీల్దారు రైతులను బెదిరించివచ్చినట్లు తూలనాడారు. ప్రజారక్షణ చట్టం అమలులోవున్న అవకాశం తీసికొని పోలీసు బలంతో శిస్తులు వసూలు చేయడానికి పూనుకున్నారు.

సాధారణంగా ప్రతి సంవత్సరమూ కూడ కోడూరు ఫిర్కాలో దీవప్రజలు సమయానికి డబ్బు వుండక ఏప్రిల్, మే మాసాలలో కూడ శిస్తులు కడుతూనే వుంటారు. సకాలంలో శిస్తులు వసూలు కానందుకు గ్రామాధికారులను సస్పెండ్ చేయడంకూడ తరుచు జరుగుతూవుంటుంది. కాని ఈ సంవత్సరం ప్రజారక్షణ చట్టం అమలులో వుందనే ధైర్యంతో 15 రోజుల వ్యవధికూడ యివ్వడానికి అధికారులు నిరాకరించారు.

25 వ తేదీన డి. యస్. పి; డిప్యూటీ కలెక్టర్లు సాయుధరిజర్వును వెంటపెట్టుకుని కోడూరు వచ్చారు. అర్ధరాత్రివేళ కోడూరు, ఉండిమెరక, స్వతంత్రపురం, నరసింహపురం, హరిపురం, వుల్లిపాలెం, విశ్వనాథపల్లి గ్రామాలపై దాడిచేసి సోదాలు, అరెస్టులు, లాఠీచార్జీలు చేశారు.

కోడూరు శివారు యిస్మాయిల్ బేగ్ పేట కాపురస్థులు అక్కు భూషయ్యగారిని లాఠీచార్జి చేసి అరెస్టుచేశారు. ఆయన ప్రభుత్వానికి శిస్తు చెల్లించవలసిన అవసరంకూడ లేదు. విశ్వనాథపల్లి కాపురస్థుడు శాలి గోపాలంగారిని అరెస్టుచేసి ఆయనభార్యను గ్రామాధికారులు నీచమైన దుర్భాషలాడినారు. అప్పుడు పై అధికారులుకూడ అక్కడే వున్నారు. ఈసమయంలో గ్రామాధికారులు పాతకక్షలన్నీ తీర్చుకుంటున్నారు. పై అధికారులు వారికి మద్దతు యిస్తున్నారు. ఇప్పటికి సుమారు 30 మంది రైతులను అరెస్టు చేశారు.

ఈ నిర్బంధాల కారణంగా రైతులు భయభ్రాంతులయ్యారు. దస్తా 7, 8 రూపాయలకు కూడ అమ్ముకుని శిస్తులు కట్టారు.

పై విషయాలు తెలియచేస్తూ దివితాలూకా రైతుసంఘ కార్యదర్శి కృష్ణాజిల్లా కలెక్టరుగారికి ఒక విజ్ఞప్తి సమర్పించారు. అందులో ఉదహరించిన రైతులను వదలివేయా [illegible] అవసరంతోందా

అందుకు కలెక్టరు అలా చేయడానికి వీలు లేదని సమాధానమిచ్చారు. కమ్యూనిస్టులు శిస్తులు కట్టవద్దని ప్రచారంచేస్తున్నట్లు తమకు క్రిందినుండి రిపోర్టులు వచ్చాయని, మీరు చెప్పింది నమ్మడానికి వీలులేదని ఈ అరెస్టులు, లాఠీచార్జీలు సాగవలసిందేనని కలెక్టరుగారు అన్నారు. బహిరంగమైన విచారణ జరిపి నిజం తెలుసుకోమని కోరినా వినిపించుకోలేదు. మీరు చెప్పదలచుకున్నది ఈ నిర్బంధాలు దగ్గరవుండిసాగిస్తున్న "డిప్యూటీ కలెక్టరుకే చెప్పుకోండి. ఇక్కడికి రావల్సిన అవసరం లేదు" అన్నారు.

కాంగ్రెసు మంత్రుల కాలంలో స్థానికాధికారులు ప్రజలపై దౌర్జన్యంసాగించి దాన్ని సమర్థించుకో గలుగుతున్నారు. ప్రజారక్షణ చట్టం ఉద్యోగుల నిరంకుశత్వానికి మరింత బలమిచ్చింది. పరిస్థితులను గురించి కాంగ్రెసు మంత్రులు ఈ పోలీసు దౌర్జన్యాలను అపుచేయించి, స్థానికాధికారులను అదుపులో ఉంచాలని ప్రజలు ఆందోళన చేస్తున్నారు.

దొంగవ్యాపారం చేసినందుకు అన్నామలై రాజా, కుమారరాజాలకు శిక్ష

లోటస్ మిల్లు కేసులో తీర్పు

కోయంబత్తూరు, ఏప్రిల్ 3

మార్చి 31 న లోటస్ మిల్లులో దొంగ వ్యాపారం చేసినందుకై డైరెక్టర్లపై, తదితరులపై జరిమానాలు విధించబడినాయి.

నేరం జరిగినది 1946 మే 12 న.

కేసుపెట్టినది 1946 డిసెంబరు 2 న.

శిక్షించినది 1947 మార్చి 31 న.

1946 యారన్ అండ్ క్లాత్ కంట్రోలు ఆర్డరును ధిక్కరించిన నేరంమోపి ముద్దాయిలకు దిగువశిక్షలు వేశారు

(1) రాజా సర్ అన్నామలై చెట్టియార్ మొత్తం 15 వేల రూపాయలు; (2) కుమారరాజా సర్ ఎమ్. ఏ. ముత్తయ్య చెట్టియార్ (మద్రాసు శాసనసభ సభ్యుడు. కాంగ్రెసుతరపున రాజ్యాంగ పరిషత్ సభ్యుడు), ఆర్. రామనాథన్ చెట్టియార్లకు చెరియొక 15 వేలు; ఎమ్. ఏ. చిదంబరచెట్టియార్ (అన్నామలైచెట్టి కుమారుడు, ముత్తయ్యచెట్టియార్ సోదరుడు, లోటస్ మిల్లుల భాగస్వామి)కు 60 వేల రూపాయలు, నాచియప్పచెట్టియార్, కలసియప్ప చెట్టియార్, కరుప్పయ్య చెట్టియార్లకు ఒక్కొక్కరికి 15 వేల రూపాయలు; విగ్గిన్సు (డైరెక్టరు, ఆఫీసు మేనేజరు)కు 15 వేల రూపాయలు; వల్లియప్ప చెట్టియార్కు మూడునెలల శిక్ష, 6 వేల రూపాయల జరిమానా విధించబడింది.

ప్రజలకు బట్ట, పారిశ్రామికులకు నూలు లేకుండా చేసి, దొంగవ్యాపారంలో లక్షలు గడించిన యీసమాజశత్రువులు తమ లక్షల లాభాలలో ఈకొద్దివేల జరిమానాలు చెల్లించి వేస్తారు. దొంగవ్యాపారుల్ని ఉరి తీస్తామన్న కాంగ్రెస్ నాయకుల గంభీరోపన్యాసాలు ఇంత మాత్రంగానైనా అమలు జరుగుచున్నందుకు మనం సంతోషించాలి.

కేసు చరిత్ర

1946, మేనెల 12 వ తేదీన రాత్రివేళ లారీలలో నిక్కి నూలు ఎక్కించి, దొంగవ్యాపారానికై లోటస్ మిల్లునుండి పట్టుకొని పోతుండగా ఎర్రజెండా యూనియన్ కార్మికులు యీద్రోహులను పోలీసులకు పట్టియిచ్చారు. కాని, కేసుమాత్రం ఎంతకూ బయటపడలేదు. పైగా అటువంటి పనిచేసినందుకు ఎర్రజెండా కార్మికులపై యజమానులు దాడి ప్రారంభించారు. ఎందరినో వుద్యోగాలనుండి వేరువేరు కారణాలు చూపి తొలగించడంప్రారంభించారు.

ఈ మాదిరి కేసులన్నీ మద్రాసు ప్రభుత్వ దృష్టికి తెస్తూ ప్రజాందోళన ప్రారంభమయింది. సెప్టెంబరు 3 వ తేదీన కమిటీవారు కమ్యూనిస్టుకమిటీ మంత్రివర్గానికి ఒక మెమోరాండంకూడా యిచ్చారు.

కడుపునిండా తిండి, వుద్యోగంలో రక్షణ కోరుతూన్న నీదకూలీలపై దాడి జరపడంలో వున్న చురుకుదనాన్ని, లక్షలకధిపతులైన మిల్లుయజమానుల ప్రజాద్రోహకార్యాల విచారణలో ప్రకా[illegible] మంత్రివర్గం ప్రదర్శించలేక పోయింది. పైగా ప్రకాశంగారు అసెంబ్లీలో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ దొంగకేసుల విషయం కమ్యూనిస్టులు బయటపెట్టి అల్లరి చేస్తూండడంచేత, యజమానులు జాగ్రత్తపడి తమకు అందకుండా పోతున్నారని కమ్యూనిస్టులపైననే నేరం మోపారు.

కాని, మే 12 వ తేదీన పట్టుబడిన నూలు కట్టలు లోటస్ మిల్లులలో తయారయినవేనా, కాదా అనే విషయాన్ని, ఆ విషయంలో సమర్థులైన ప్రభుత్వోద్యోగి ముందు పరీక్షకు పెట్టడమూ, ఆయన అవును, కాదు అనకుండా గోడమీది పిల్లివాటంగా రిపోర్టు నివ్వడమూ జరిగింది. అటువంటి సందర్భంలో ప్రభుత్వం రాష్ట్రం వెలుపలి విషయజ్ఞులతో సంప్రదించకుండా అసలు ఆ విషయాన్ని వల్లగా జారవిడచింది.

కాని, అప్పుడు కూడా దొంగవ్యాపారం శిక్షించేబందుకై లోటస్ మిల్లువారిపై చెలరేగిన కేసులు పెట్టబడలేదు. ప్రజాందోళన పెరిగింది. ఆంధ్రదేశంలో కూడా 'ప్రజాశక్తి' ప్రజాందోళనను ప్రతిబింబించింది. కరపత్రాలు వేశారు. (నవంబరు 4 న). చిట్టచివరకు డిసెంబరు 2 వ తేదీన 9 గురు ముద్దాయిలను చేర్చి కేసు పెట్టబడింది. ప్రజాందోళన ఫలించింది. దొంగవ్యాపారులకు యీ కొద్దిశిక్షలయినా పడ్డాయి.

మే మొదటివారంలో ఆకలియాత్రలు

(5 వ పేజీ తరువాయి)

నీద రైతులకు వ్యవసాయ కూలీలకు అందుబాటులో ఉండేటట్లు పేరునాన్ని రు. 5 లకు తగ్గించాలి.

ప్రస్తుతమున్న లెవీవిధానము పద్ధతిని రద్దుచేసి ఎన్నిక పద్ధతిని ప్రవేశపెట్టాలి.

ధాన్యసేకరణయేగాక గ్రామాల్లో జీవితావసర వస్తువుల పంపకంగూడ వీటి ద్వారానే జరగాలి.

ఈ లోపల ప్రస్తుత ఆహార కమిటీలు ఇతర ప్రజాసంస్థలు, ఇతర పార్టీల ప్రతినిధులను కలుపుకొని. వీనిద్వారా ప్రభుత్వం స్వయంగా డబ్బుపెట్టి ధాన్యసేకరణ చేయాలి.

గ్రామావసరాలకు పోను మిగతా ధాన్యాన్నే సేకరించాలి.

2 ప్రస్తుతమున్న బియ్యపు రేటు 25-5-0 అలాగేవుంచి, రైతులకు పుట్టిపడ్డ బస్తా ఒకటికి రు, 11-0-0 ఇవ్వాలి.

3. మెట్ట ప్రాంతాల్లో జొన్నలు రాగులకుగూడ సరసమైన ధరలు ఇచ్చి సేకరించాలి.

4. వేరుశనగకాయకు మణుగుకు 3-0-0 కనీస రేటు నిర్ణయించాలి.

వేరుశనగ నూనె వీసె 1-4-0 కు కంట్రోలు చేయాలి. మిగతా నూనెలుగూడ పైవిధంగానే కంట్రోలు చేయాలి.

5. రైతులు వ్యవసాయకూలీలకురోజుకు 7 గంటల పనికి కనీస కూలి 1-0-0 ఇవ్వాలి.

పాలేళ్ళకు కలవుల ఇయ్యాలి. పని గంటలు నిర్ణయం చెయ్యాలి.

వ్యవసాయకూలీల కనీస కోర్కెల చట్టాన్ని ప్యాసు చేయాలి.

2. బట్టల సమస్య పరిష్కారం

(అ) కార్మికుల కనీస కోర్కెలు నంగీకరించి. బట్టలమిల్లు యజమానులు బట్టలు నూలు ఉత్పత్తిని పెంచేట్లు చూడాలి. కార్మికుల కోర్కెలను నిరాకరించుతూ ఉత్పత్తిని నిరోధించే యజమానుల మిల్లులను స్వాధీనపరచుకొని ప్రభుత్వమే నడపాలి.

(ఆ) ప్రస్తుత మద్రాసు ప్రభుత్వ పథకాన్ని మార్చుకొని, బట్టల మిల్లులను, నూలు మిల్లులను పత్తిపండే ప్రాంతాల్లో పనిగా స్థాపించాలి.

(ఇ) 1. చేనేత పారిశ్రామికులకు కనీసం నెలకు 25 రోజులకు సరిపడా నూలు ఇవ్వబడాలి.

2. చేనేత పారిశ్రామిక కుటుంబానికి నెలకు ఏపీసం రు 75 లు గిట్టేటట్లుగా మజూ

3. చేనేత సహకారసంఘాలకు దోహదమియ్యాలి.

4. చేనేత గుడ్డనుగూడ కంట్రోలుచేసి రేషనింగు విధానంలోచేర్చి ప్రజలకు పంపిణీ చేయాలి.

(ఈ) అత్యవసర వస్తువుల మారకానికి తప్ప ఇతర దేశాలకు బట్ట ఎగుమతి చేయగూడదు.

3. ఆహారకమిటీలు పునర్నిర్మించాలి

(అ) గ్రామాలలోనూ, పట్టణాలలోనూ మైనారిటీ వెళ్ళిన స్త్రీ పురుషు లందరిచేతా ఎన్నుకోబడాలి.

(ఆ) గ్రామ, పట్టణంలోని వార్డు కమిటీలచే తాలూకా, పట్టణ ఆహార కమిటీలు, అలాగే తాలూకా, పట్టణ కమిటీలచే జిల్లా ఆహార కమిటీలు ఎన్నుకోబడాలి.

(ఇ) జీవితావసర వస్తువుల పంపిణీ అజమాయిషీ అంతా ఈ ఆహార కమిటీలు చేయాలి.

ప్రజారక్షణచట్టాన్ని రద్దుచేయాలి. డెటిన్యూలందరినీ విడుదలచేయాలి. రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలి. పౌరసత్వ హక్కులను తిరిగి నెలకొల్పాలి.

ఐక్యప్రజాందోళన- "మే" మొదటి వారంలో ఆకలి యాత్రలు

జీవితావసర వస్తువుల కరువుపోయి ప్రజలు జీవించాలంటే, పై కోర్కెల కోసం ఐక్య ప్రజాఉద్యమాన్ని నిర్మించాలి.

రైతులు, కూలీలు, కార్మికులు, మధ్యతరగతివారు, గ్రామవాసులు, పట్టణవాసులు, స్త్రీలు పురుషులూ-అందరూ ఐక్యమయి, స్వార్థపరులైన జమీందారుల, పెద్ద భూస్వాముల, మిల్లు యజమానుల, బ్లాక్ మార్కెటు దార్ల నిరంకుశోద్యోగుల ప్రజావ్యతిరేక చర్యలను అరికట్టాలి, పై కోర్కెలకోసం ఐక్య ఆందోళనను సాగించాలి. కాంగ్రెసు మంత్రివర్గం ప్రజా వ్యతిరేకులతో చేతులు కలిపి ప్రజలమీద సాగించే నిర్బంధ విధానాన్ని మానుకునేట్లు చేయాలి. స్వామ్యవాదుల, నిరంకుశోద్యోగుల పెడల దూకుడుగుడారు విధానాన్ని మానుకునేలా చేయాలి.

"మే" మొదటివారంలో, కార్మిక, రైతు కూలి, చేనేత పారిశ్రామిక, మహిళా, యువజన సంఘాలు అన్నీ ఐక్యంగా ప్రజలను సమీకరించి, తాలూకా కేంద్రాలకు ఆకలి యాత్రలను నడిపి, పై కోర్కెలతో గూడిన

ఐక్యపోరాటమే మార్గం

(7 వ పేజీ తరువాయి)

(1) కార్మికులు జీవించుటకు తగిన వేతనం లభించు శాసనం చేయాలి.

(2) ధరలు ఏ దామాషా చొప్పున పెరిగితే ఆ దామాషా ననుసరించి కరువుభత్యం పెంచాలి.

(3) రిట్రెంచిమెంటు (పనినుండి తొలగించుట) కూడదు.

(4) కార్మికులకు నిరుద్యోగ భత్యం ఈయాలి.

(5) సంవత్సరానికి ఒక మాసం సెలవు జీతంతో ఇవ్వాలి.

(6) బోనసు యివ్వాలి, ప్రావిడెంటు ఫండు ఇవ్వాలి, వృద్ధాప్యభృతి, ప్రసవ భృతి ఇవ్వాలి

(7) ఆరోగ్యకరమైన ఇండ్లు కట్టించాలి.

(8) బిడ్డలకు ఉచిత విద్యా సౌకర్యం కలిగించాలి.

(9) యూనియన్లను శాశ్వతంగా గుర్తించాలి

(10) సిక్, ఇన్స్యూరెన్సు పద్ధతి అమలు పర్చాలి; తగు వైద్య సౌకర్యం కలిగించాలి.

(11) కార్మికుల సమ్మె హక్కును గుర్తించాలి.

కమ్యూనిస్టులు నేడీ ముఖ్యమైన కోర్కెల కొరకే కార్మికోద్యమాన్ని నిర్మించి ఐక్యపరచారు. దానికి నాయకత్వం వహించారు. ఈ హక్కులకై తుదిదాకా పోరాడుతారు.

ఐక్యంగా పోరాడుటే ఏకైకమార్గం

కార్మికులముందు ఒకటే మార్గమున్నది- తమ ఐక్యసంఘటితశక్తి, నిర్మాణబలములపై ఆధారపడిన పోరాటమార్గము. సమ్మె ఆయుధంద్వారా ప్రభుత్వాన్ని, పెట్టుబడిదారులను, దిగివచ్చునట్లుచేసి మంచి జీవిత పరిస్థితులను సంపాదించాలి. లేనిచో అల్ప జీవితపరిమాణం, నిరుద్యోగం జబ్బులు, ఋణభారం, దారిద్ర్యం అనుభవించవలసి వస్తుంది.

కార్మికవర్గం దాసిపత్వాన్ని, వస్తువులవలెనుండటాన్ని సహించదు. స్వాతంత్ర్యం, సౌఖ్యం కోరుతుంది.

హిందూ-ముస్లిం ఐక్యత కార్మికవర్గ పోరాటంద్వారా నిర్మించబడింది. ఈ ఐక్యతను ఇంకా బలపర్చాలి. చీలికలు కలిగించు మత దురహంకారులను, పెట్టుబడిదారులను, ప్రభుత్వ ఏజంట్లను ఎదిరించి వారికి అపజయం కలుగజేయాలి. మన నిర్మాణాన్ని బలపర్చుకొని పోరాడుటే మన కర్తవ్యం.

కార్మిక సోదరులారా!

పార్టీ. మీ ఎర్రజెండా పార్టీ, జాలం, దోపిడీలకు వ్యతిరేకంగా తిండి, బట్ట, న్యాయంకొరకు వేలకొలది కార్మికులను సంఘటితపరచి, నడిపించింది. ఈ పార్టీలో మీరు మీ ఉత్తమ సహచరు లందర్నీ చేర్చారు. మానవుడు మానవున్ని దోపిడీచేయు పద్ధతిని అంతమొందించు స్వాతంత్ర్య సౌఖ్య సమాజాన్ని నెలకొల్పుటకు, ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించుటకు, తద్వారా అందరికి తిండి, బ్రతుకుదెరువు, విద్య, ఆరోగ్యం, సంపత్ప్రాప్తి, నాగరికతలను పొందుటకు, సమానావకాశాలు లభింపజేయుటకు కమ్యూనిస్టులు ప్రతిజ్ఞ చేశారు.

ఇతరులను దోపిడీ చేసి జీవించు, పరాన్నభుక్కులగు పెట్టుబడిదారులు, జాగీర్దార్లు బ్రిటిషు సామ్రాజ్యవాదులు విశ్వసించుచున్న ప్రజా, కార్మిక ఉద్యమాలను అణచి తమ దోపిడీని సాగించుటకు ప్రయత్నిస్తున్నారు. అందుచేతనే వారు కమ్యూనిస్టు పార్టీని నాశనంచేసి, విప్లవ కార్మికులను కార్మికోద్యమాన్ని రక్తపాతంలో ముంచేయదలచారు. మీ ప్రాణస్నేహితులు, ఉత్తమ సహచరులు జైళ్ళలో క్రుళ్లుచున్నారు.

మీ పార్టీపైన కమ్యూనిస్టుపార్టీపై జరుగుచున్న దాడిని ఎదిరించి ప్రభుత్వానికి అపజయం కలిగించుట మీకర్తవ్యం - జైళ్ళలో యున్న కార్మిక సేవకులనందరినీ ఈ నిరంకుశ ప్రభుత్వ నిర్బంధముల నుండి విడుదల చేయించుట మీ బాధ్యత.

(1) ముఖ్యమైన కార్మికకోర్కెలకొరకై పోరాడండి.

(2) యూనియన్లను బలపర్చండి, సభ్యుల సంఖ్య పెంచండి, ప్రతి కార్మికుడూ యూనియన్ సభ్యుడు కావాలి.

(3) మీ యూనియన్ను అఖిల హైదరాబాదు ట్రేడుయూనియన్ కాంగ్రెసులో చేర్పండి. తద్వారా హైదరాబాదు కార్మికులందరి ఐక్య బలంతో పోరాడండి.

(4) మీ యూనియన్ను అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుతో జతపర్చండి. తద్వారా అఖిలభారత విప్లవ కార్మిక వర్గం అండ సంపాదించి పోరాడండి.

హై. సర్క్యులర్, అరెస్టుచేయబడిన నాయకుల విడుదలకు ఆందోళనచేయండి. కమ్యూనిస్టుపార్టీపై నిషేధం తొలగించుటకై ప్రభుత్వాన్ని తొందరచేయండి.

కార్మికులారా ఏకముగండి! రాజకీయ ఖైదీలను విడుదలచేయాలి. హిందూ-ముస్లిం ఐక్యతవర్ధిల్లాలి. ప్రజాప్రభుత్వం స్థాపించాలి. విప్లవం వర్ధిల్లాలి. కమ్యూనిస్టుపార్టీ జిందా

హిందూధర్మశాస్త్రసవరణకు రావుకమిటీ సూచనలు

ఏకపత్నీవ్రతం అవసరం; తండ్రిఆస్తిలో కూతుళ్లకుభాగం; వివాహంలో సంస్కరణ; విడాకుల హక్కు

ఈ రిపోర్టును వెంటనే చట్టం చేయాలి

హిందూ ధర్మశాస్త్రాన్ని సవరించుటకు, క్రోడీకరించుటకు బి.ఎన్. రావు కమిటీ రెండు సంవత్సరాల క్రితం ఏర్పడింది. ఇంతకాలానికి వారి రిపోర్టు బయటపడింది. ఇప్పటికైనా తమ రిపోర్టును పూర్తిచేసి ప్రభుత్వానికి అందజేసినందుకు హిందూ ప్రజలందరూ వారిని అభినందించాలి. ఇలాంటి సంస్కరణ విషయాలలో అయిష్టంతో తప్పటడుగులు వేస్తూ కాలయాపన చేయడం ప్రభుత్వానికి అలవాటు. అందుచేతనే దీని కింతకాలం పట్టింది.

బి. ఎన్. రావు కమిటీ

పుర్స్పారీలాంటి ధర్మశాస్త్రవేత్తలు, టి. ఆర్. వెంకట్రామశాస్త్రి లాంటి న్యాయవాదులు, రాజగోపాలన్ లాంటి ప్రభుత్వోద్యోగులు వున్న కమిటీ యిది. విప్లవం తెచ్చిపెట్టే కమిటీ ఏమీకాదు. అయినప్పటికీ అలాంటివారుకూడా నేటి ప్రపంచ పరిస్థితులకు మన పురాతన హిందూ ధర్మశాస్త్రం ఎంత దూరమయిపోయిందో తెలుసుకోగలిగారు. అందుమీదటనే ఈ మార్పులను సూచిస్తూ రిపోర్టు యిచ్చారు.

రిపోర్టు సారాంశం

కేంద్ర ప్రభుత్వంయొక్క అధికారానికి లోబడిపోయిన విషయాలు - అంటే ఆస్తి సంక్రమణ, దానికి సంబంధించిన విషయాలు (వ్యావసాయక ఆస్తులు మినహా), వివాహం, విడాకులు, మైనారిటీ, గార్డియన్‌షిప్, (సంరక్షణ), దత్తత మొదలగునవి - వీటి సంస్కరణకే పూనుకొన్నది ఈకమిటీ. ఈ విషయాల్లో కమిటీ సూచించిన ముఖ్యమైన మార్పులు:

(1) అవిభక్త కుటుంబంలో దక్షిణదేశంలో ఆచరణలో వున్న కొడుకులకు కుటుంబ ఆస్తి (వ్యవసాయక భూమి మినహా) మీద జన్మతః కలిగే హక్కును తీసివేయడం. కుటుంబ ఆస్తి మీద తండ్రికే పూర్తి హక్కులు కల్పిస్తూ, దేశం మొత్తానికి, బెంగాలు, ఆ ప్రాంతాలలోవున్న "దాయభాగ" సూత్రాలనే వర్తింపజేయటం.

(2) స్త్రీలకు సంక్రమించే ఆస్తిమీద వారికి పూర్తిగా సర్వ హక్కులు కలిగించట.

(3) కూతుళ్ళకు తండ్రి ఆస్తిలో, కొడుకులకు వచ్చేదాంట్లో సగభాగానికి హక్కు కలిగించటం.

(4) దగ్గరగావున్న స్త్రీ బంధువులకు ఆస్తి సంక్రమణ హక్కు కలిగించటం.

(5) వివాహ విషయంలో పురుషులకు ఏకపత్నీ సూత్రాన్ని వర్తింపజేయటం.

(6) కొన్ని నియమిత పరిస్థితులలో భార్యా భర్తలకు విడిపోవడానికి డైవోర్సు హక్కు కలిగించడం.

(7) వర్ణవిభేదాలు, సగోత్ర, సమాన ప్రవర, సపిండ మొదలగు అనవసరపు నిషేధాలను తొలగించడం.

(8) రిజిస్ట్రేషన్ పద్ధతిని హిందూ వివాహాలకు వర్తింపజేయటం.

(9) దత్తత మొదలగు ఇతర విషయాలలో స్త్రీలకు కొన్ని హక్కులు ఇస్తూ ఇతర మార్పులు సూచించారు.

ఆస్తిసంక్రమణ అవిభక్త కుటుంబం

ధర్మశాస్త్రాలలో అవిభక్త కుటుంబ [illegible]మైన సూత్రాలు రెండురకాలుగా వున్నాయి. ఒకటి బెంగాల్ మొదలగు వుత్తరదేశాలలో వ్యవహరింపబడుతున్న "దాయభాగ"; రెండవది దక్షిణదేశంలో ఆచరణలోవున్న "మితాక్షర". దాయభాగ ప్రకారం, తండ్రి జీవించి వున్నంతకాలం కుటుంబఆస్తి మీద అతనికే పూర్తిగా సర్వహక్కులూ వుంటాయి. ఆస్తినంతటిని అతనికి ఇష్టమైనవిధంగాపరాధీనంచేయవచ్చును. మితాక్షర ప్రకారం కొడుకునకు పుట్టుకతోనే కుటుంబఆస్తిలో తండ్రితో సమాన హక్కు ఏర్పడుతుంది. కొడుకులున్న తండ్రి కొన్ని నియమిత కుటుంబఅవసరాలకే ఆస్తిని పరాధీనం చేయవచ్చును. తనకిష్టంవచ్చినట్లు చేయటానికి వీలు లేదు. కొడుకు పంచిపెట్టమన్నపుడు అతనిభాగం అతనికి ఇవ్వకతప్పదు. ఈవిధంగా మొత్తం హిందూదేశంలో కొన్ని ప్రాంతాలలో ఒకరకంగాను మరి కొన్ని ప్రాంతాలలో వేరొకరకంగాను వున్నది ధర్మశాస్త్రం. బి. యన్. రావు కమిటీ మొత్తం దేశమంతటికీ దాయభాగనే వర్తింపచేసేలాగు మార్పును సూచిస్తున్నారు. దక్షిణ ఇండియాలో కుటుంబ ఆస్తిలో కొడుకులకు జన్మతః కలిగేఆస్తిహక్కునుతీసివేస్తారన్నమాట.

అసలే జీవనోపాధి దుర్లభంగావున్న ప్రస్తుత దరిద్రస్థితిలో యువకులకున్న ఈకొద్దిపాటి హక్కునుగూడా తీసివేయడము ఏమీ అంత అభివృద్ధికరమైన మార్పుకాదు.

"హిందూదేశమంతటా వ్యవహరింపబడే ధర్మశాస్త్రం ఒకేరీతిగా వుండాలనడము ఆచరణయోగ్యమైనదికాదు.

మనువు, యాజ్ఞవల్క్యుడు మొదలగు సూత్రకారులనే అనుసరించినా వారివారి ప్రాంతాలలోవున్న ఆచారాలకు అనుగుణ్యంగా వేరేవేరే వ్యాఖ్యానాలు వ్రాశారు. జీమూతవాహనుడు దాయభాగను, విజ్ఞానేశ్వరుడు మితాక్షరను ప్రబోధించారు. ఇప్పుడు పరిస్థితులతో సంబంధంలేకుండా ఈరెంటినీ సమానం చేస్తామనడం పొరపాటు.

ఈలాగు మితాక్షరను రద్దుచేయడానికి మరొక కారణం చెప్తున్నారు. ఆదేమంటంటే — కొడుకులకున్న ఈ హక్కు, హైకోర్టుల, ప్రీవీకౌన్సిళ్ళ తీర్పులవల్ల ఇప్పటికే చాలా తరిగిపోయి వుత్తనామమాత్రంగావున్నదని వారివాదన. కోర్టుల మూలంగాను, వ్యాపారాది వ్యవహారాలననుసరించిన్నీ తండ్రి, శాస్త్రంలో నియమించినదానికన్న ఎక్కువ స్వతంత్రంగా కుటుంబాస్తిని పరాధీనం చేయగలుగుతున్నప్పటికీ, కొడుకులకు అవసరమైనప్పుడు, తండ్రి చర్యలు అసహ్యంగాను కుటుంబానికి హానికరంగాను పరిణమించినప్పుడు, విడిపోయి పంచుకొనేహక్కు వున్నదిగదా. పై కారణంవల్ల దాన్ని తీసివేయడాన్ని ఎలా సమర్థించగలరు? ఈ విషయంలో యువకుల స్వతంత్ర అభివృద్ధిని అపేక్షించే ప్రతి ఒక్కరూ పూనుకొని ఆందోళనచేసి ఈ మార్పును మాత్రం వుపసంహరించేలాగు చేయాలి.

ఆస్తి సంక్రమణలో స్త్రీల హక్కులు

స్త్రీలకు వారసత్వంమూలాన సంక్రమించే ఆస్తిమీద వారికి సర్వహక్కులూ సంపూర్ణంగా ఇవ్వబడాలి అని సూచించారు ఇది చాలా అభివృద్ధికరమైన మార్పు. ఇప్పుడు బ్రిటిష్ కోర్టులలో వ్యవహరింపబడుచున్న హిందూలాక్రింద స్త్రీకి ఆస్తి వారసత్వంగా సంక్రమిస్తే, దానిని ఆమె అమ్ముకోవడానికిగాని, తాకట్టు పెట్టడానికిగాని, దానం చేసుకోవడానికిగాని, ఇంకేవిధమైన పరాధీనం చేయడానికిగాని హక్కులేదు. దాని ఆదాయాన్ని మాత్రం అనుభవించుకోవచ్చు. ఇంతేకాక, లాలో ఇలాంటి లోపం వుండటంబట్టి ఆ ఆస్తి సంక్రమించిన నాటినుండి ఆమె జీవించియున్నంత కాలం వారసులు ఆమెను కోర్టులచుట్టూ తిప్పడం జరుగుతున్నది. ఆమెకు ఆస్తిమీద పూర్తి అధికారాలు ఇవ్వడం న్యాయం. ఆమెను కోర్టుల బాధనుంచి తప్పించడం జరుగుతుంది.

తండ్రి ఆస్తిలో కూతురికి సగభాగం

తండ్రి ఆస్తిలో కూతురుకిగూడ భాగం ఇవ్వాలని సూచించారు. ఈవిధముగా కన్నతండ్రి ఆస్తిలో హక్కు కల్పించడం అభివృద్ధికరమైన సూచనే. కూతురికి ఈ హక్కులేకపోవడంబట్టే పెండ్లిండ్లలో కట్నాల దురలవాట్లు ప్రబలమయిపోయినవి. తండ్రి ఆస్తిలో చట్టరీత్యా కూతురికికూడా భాగం వున్నదంటే, ఇక కట్నాలను గురించిన బేరాలు అనవసరమైపోతాయి.

కాని ఈ కమిటీ స్త్రీల హక్కులను మనఃపూర్వకంగా గుర్తించలేదు. కొడుకు భాగంలో సగము కూతురుకివ్వడం ఎందుకు? మళ్లా పురుషుల కన్ను తుడవడానికి తల్లి స్త్రీ ధన ఆస్తిలో కొడుకునకు సగభాగానికి హక్కు కలిగిస్తున్నారు. ఇతరబంధువుల ఆస్తి సంక్రమణ విషయంలో స్త్రీ పురుషుల మధ్య వున్న విచక్షణతను అలాగేవుంచేస్తున్నారు. స్త్రీలకు పురుషులతో సమానమైన హక్కులుండాలి అనే విషయాన్ని కాదనేవారు నేడు ప్రపంచంలో ఎక్కడా లేరనే చెప్పాలి. అలాంటప్పుడు వారసత్వపు హక్కుల విషయంలో అందులో తండ్రి ఆస్తిలో భాగస్వామిగా వుండటంలో స్త్రీ పురుషుల మధ్య తేడా చూపడం కమిటీయొక్క సంకుచిత దృష్టినే వెల్లడిస్తున్నది. నేటి పరిస్థితులకు అనుగుణ్యంగా ఉండవలసినంత అభివృద్ధి కరంగా ఈ సూచనలులేవు.

వివాహం, విడాకులు

హిందూ ధర్మశాస్త్రంలో వివాహ సంస్కరణకు సంబంధించిన సూత్రాలు స్త్రీలను పశువులకన్నా అన్యాయంగా చూస్తున్నాయి. బ్రాహ్మ, అసుర, అనే రెండు రకాల వివాహాల్ని మాత్రం కలియుగంలో ధర్మమైన వివాహాలన్నారు. అంటే అర్థమేమిటి? తండ్రి తనబిడ్డను దానమైనా చేయాలి. (బ్రాహ్మ అంటే కన్యాదానం); అమ్మకోనైనా అమ్మకోవచ్చు (అసుర అంటే డబ్బుతీసుకొని కన్యనివ్వడం) ఇవి మన ధర్మశాస్త్రంలో స్త్రీలకు విధింపబడిన వివాహ పద్ధతులు దానితోబాటు 8 ఏండ్ల లోపలనే తండ్రి కన్యను పరాధీనం చేసేయాలని విధింపబడింది! శాస్త్రవిధి శారదా ఆక్టునుకూడా నిర్లక్ష్యంచేసేలాగు బాధిస్తున్నది మన హిందువులను. ఈ బాల్యవివాహాలవల్ల మన సమాజం ఎంత దురవస్థపాలగుచున్నదో చూస్తున్నాము. మహాత్మ గాంధీగారుకూడా బాల్యవివాహాలను తీవ్రంగా ఖండిస్తున్నారు.

స్త్రీలుగూడా మానవులే అని గుర్తిస్తే పురుషులలాగా వారికికూడా వారి వివాహ విషయంలో పూర్తిగా స్వతంత్రంగా వ్యవహరించడానికి హక్కు యెందుకు ఇవ్వకూడదో తెలియచేయటం లేదు. అజన్మాంతంగా ఏర్పడే ఈ వివాహ బంధనంలో వారికి ఏమాత్రం హక్కు లేకపోవడం చాలా అన్యాయం.

ఇక వర్ణ విభేదాలు, సగోత్ర, సమాన ప్రవర, సపిండ, మొదలగు నిషేధాలు ఎన్నోవున్నాయి.

అన్నిటికంటే ఘోరమైనది ఏమిటంటే స్త్రీ మాత్రం తనభర్త తన్ను ఎన్ని ఇదుములుపెట్టినా, అతడు ఎంత అవినీతిపరుడైనా, ఎన్ని రోగాలకు గురి అయినా, ఎందరిని పెండ్లిచేసుకొన్నా, ఆమె చచ్చేదాక అతన్ని వదలిపెట్టడానికి వీలులేదు. వదలితే ఆమెకు వేరే దిక్కులేదు ఈ సమాజంలో. పురుషుడుమాత్రం ఎందరు భార్యలనయినా చేసుకోవచ్చు ఇది మన ధర్మశాస్త్రం.

ఏక పత్నీ నియమం

బి. ఎన్. రావు కమిటీ ఈ సూత్రాలలో కొంతమార్పు తీసుకు రాదలచింది. పురుషులకుకూడా ఏకపత్నీ నియమాన్ని విధించాలని సూచించారు. అంటే భార్య వుండగా మరొక భార్యను స్వీకరించడం నిషేధింపబడుతుంది. ఇది చాలా మేలుగే. దీనిమూలాన భర్త నిరంకుశ నీచ ప్రవర్తన తప్పకుండా మార్పుచెందగలదు.

విడాకులు

కొన్ని నియమిత పరిస్థితుల్లో భార్యాభర్తలకు విడిపోయి వేరే పెండ్లిండ్లు చేసుకోవడానికి హక్కు కల్పించాలని సూచించారు. ఇదికూడా చాలా అభివృద్ధికరమైన మార్పే. కాని ఈ విషయంలో ఇంకా కాస్త సంకుచిత ధోరణి కనిపిస్తున్నది. భర్తకు పిచ్చెత్తినప్పుడు భర్త భార్యను వదలివేసినప్పుడుకూడా విడాకులకు అయిదు సంవత్సరాలు వేచివుండాలని చెప్పడంలో అర్థంలేదు. పిచ్చెత్తినవాడు ఒకటి రెండు సంవత్సరాలలో బాగుపడకపోతే అటుతరువాత బాగుపడడం ఎక్కువ సందేహాస్పదం. అలాంటప్పుడు భార్యను, అతడు బాగుపడతాడా లేదా అని వీక్షిస్తూ తన జీవితాన్ని భగ్నపరచుకొనమనడం ఆమెకు అన్యాయం చేయటమేకదా. భర్త ఎలాగైనా పిచ్చివాడై పోయాడు. 5 ఏండ్ల పరిమితి పెట్టడంవల్ల భార్యనుగూడా పిచ్చిదానిగా మార్చడమే అవుతుంది.

అలాగే భార్యను వదలి వెళ్ళిపోయిన భర్త మళ్ళా వస్తాడేమోఅని, అతని రాకకు 5 ఏండ్లు ఎదురు చూస్తుండమని విధించడంకూడా అన్యాయమే. వదలిపెట్టడమే వాస్తవమైతే, మళ్ళా రావడం జరిగితే, శీఘ్రంగా జరగాలి. లేకపోతే ఎక్కువకాలం అయ్యేకొద్దీ వారిద్దరూ ఎక్కువదూరమై పోవడమే జరుగుతుంది సామాన్యంగా. [illegible] 5 సంవత్సరాల వ్యవధి కల్పించడం మూలాన మళ్ళా ఆ భర్త. తనదారి[illegible] స్వీకరించడానికి త్వరలో ఆదుర్దా [illegible] దానికి వుపయోగపడదు. ఈ వ్యవధి తగ్గిస్తే వెళ్ళిపోయేటప్పుడే ఆలోచిస్తారు. వెళ్ళిపోయిన తరువాత కూడా కాస్త త్వరగా ఆలోచనలో పడడానికి లాకూడా అనుకూలిస్తుంది. భార్య జీవితంకూడా నిరుత్సాహము. నిస్పృహ ఎక్కువకాకముందే చక్కపడడానికి అవకాశం ఏర్పడవచ్చు.

విడాకులుఉండకూడదని వాదించేవారి దనలో పసహున్యం. పెండ్లిచేసుకొనేవారు విడిపోవడానికి చేసుకోరుగదా. కమిటీ వారు రిపోర్టులో చెప్పినట్లు "మన హిందూసమాజంలో ఈహక్కును ఇచ్చినప్పటికీ దానిని వర్తింపజేసేవారు చాలా కొద్దిమందే వుంటారు" దీనికి ఉదాహరణగా మలబారులో వివాహచట్టం తీసుకొని రుజువుచేశారు. ఆచట్టంక్రింద విడాకులకు ఏకారణం అనవసరం. భార్యాభర్తలలో ఏఒక్కరికైనా ఇష్టంలేకపోతే విడాకులు యిచ్చుకోవచ్చు. కాని చట్టంక్రింద పెండ్లిచేసుకొన్న వారిలో విడాకులు కోరినవారి సంఖ్య లెక్కకు రాదే. కమిటీ రిపోర్టులో చెప్పినట్లు బాధపడేవారు లక్షమందిలో ఒకరైనా లోలోపల వారిబాధ నివారణకు మార్గం ఏర్పడివుండాలి.

వర్ణవిభేదాలు మొదలైన నిషేధాలు

వర్ణవిభేదాలు, సగోత్రాలు, మొదలైన నిషేధాలు తొలగించాలని సూచించారు. మనసమాజాన్ని వెనక్కులాగే శక్తులలో ముఖ్యమైనవి వర్ణవిభేదాలు. ఇది సమూలంగా నాశనంకావాలంటే దానికి ఒక ముఖ్యమైన మార్గం వివిధ వర్ణాలమధ్య వివాహాలకున్న నిషేధాన్ని తొలగించడం. కాబట్టి ఈ సూచనకూడా మన సమాజాన్ని ముందుకు తీసుకొని పోవడానికి చాలా వుపయోగపడుతుంది. ఈ నిషేధాలను పాటించాలనుకొన్న కరడుకట్టిన సనాతనులుంటే వారు తమ పురాతన నియమాలను పాటించుకోవచ్చును కాని మన యువకులలో విద్యార్థులలో ఈ పాటింపులు చాలవరకు వదలిపోనవి.

ఈ రిపోర్టులలో పెద్దలోపం బాల్యవివాహం విషయంలో తగిన శ్రద్ధ వహించకపోవడం. ఇంకా స్త్రీలకు తమ వివాహవిషయంలో స్వంతంగా వ్యవహరించుకోడానికి పూర్తిహక్కులు, అవకాశాలు కల్పించబడలేదు. 16 ఏండ్లలోపు వున్న కన్యలకు జరిగే వివాహాలు పూర్తిగా నిషేధించి, చట్టవిరుద్ధంగా చెల్లనేరని వానిగను చేయాలి. అలాంటి వివాహాలకు బాధ్యతవహించేవారికి కఠినశిక్షలు విధించాలి. బాలికావ్యాపారా

(మిగతా 10 వ పేజీలో)

దేశ స్వాతంత్ర్య అభ్యుదయాలకై

తమ రక్తాన్ని ధారవోసిన వీట్‌నామ్ మహిళల ఉజ్వల వీరగాథ

[భారత దేశంలో వీట్-నామ్ రిపబ్లిక్ ప్రతినిధిగావున్న మా-తే-చా తమ స్వతంత్ర పోరాటంలో వీట్-నామ్ మహిళల వీరోచిత పాత్రను వివరిస్తూ వ్రాసిన వ్యాసం.]

వీట్-నామ్‌లో యీనాడు సాగు తున్న స్వతంత్రపోరాటంలో స్త్రీలు తమ పాత్ర నెరవేరుస్తున్నారు. అనేక కష్ట నష్టాలనుభవించటమేగాక, పురుషులతో పాటు ఆయుధాలను ధరించి ఫ్రెంచి సామ్రాజ్యవాద దురాక్రమణకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటంలో అనుసరిస్తున్నారు.

మా మహిళలకు ఇదేమీ కొత్తకాదు. మా జాతీయోద్యమం మొదటి రోజుల నుండీ వంటయిళ్ళను వదలి, స్వతంత్ర పోరాటాల్లో పాల్గొంటూనే వస్తున్నారు. పురుషులతోపాటు సమాన పాత్ర వహిస్తున్నారు.

మొదటి రోజుల్లో

ఫ్రెంచి సామ్రాజ్యవాదుల దురాక్రమణకు ముందు చైనా సామ్రాజ్యవాదుల నిరంకుశ పాలనక్రింద వీట్-నామ్ ప్రజలు నలిగిపోయేవారు.

...రు. ఈ గడ్డు సంవత్సరాల్లో స్త్రీ గెరిల్లాలు పురుషులతోబాటు తమ వీరోచిత పాత్ర నెరవేర్చారు.

1945 ఆగస్టులో జపాన్ లొంగిపోయింది. కాని బ్రిటిష్ ఇండియా సైనికుల బాయొనెట్లచాటున ఫ్రెంచిసామ్రాజ్యవాదులు మళ్ళీ ప్రత్యక్షమయారు. దీనితో వీట్-నామీయుల స్వతంత్రపోరాటంలో చివరిదశ ఆరంభమయింది.

మా రక్త మాంసాలతో నిర్మించిన ...

...కుల సందేశాలను ప్రజలకు అందజేస్తున్నదికూడా యీ వీరాంగనలే.

చేతిలో కత్తి

టోన్-కిన్‌లో స్త్రీ సైనికదళాలు అసమాన ధైర్యసాహసాలను ప్రదర్శిస్తున్నాయి. హానోయ్‌లోని వార్తాపత్రికల్లో యీ క్రింది వార్త ప్రచారమైంది.

"ఈనాటి యుద్ధరంగాలైన దయాళ్ళ గుండా ప్రయాణంచేస్తున్నపుడు అన్నాం యువకుల మొండాలు (తలలేనిశరీరాలు) ... వారిలో ఒక యువతి ..."

(రూటర్ 1947 జనవరి 18)

సమానత్వం సాధించారు

ఈ మార్పులు వ్యవసాయ ఆస్తులకు వర్తింపజేయాలి

ద్వారకనాథ మిత్తర్ అభివృద్ధినిరోధక పంథా

ధర్మశాస్త్రం మార్పుచెందాలి

తుదిమాట

రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత

విషవృక్షం

వెంకటరెడ్డి

25 సంవత్సరాల వీరవనిత థి-నామ్

జర్మనీ పునర్నిర్మాణం

అమెరికా సూచన ప్రమాదకరము

జాన్‌స్టీల్ ప్రశ్నలకు మాలొటావ్ జవాబులు

లండన్, ఏప్రిల్ 4

అమెరికారేడియో వ్యాఖ్యాతజాన్ సీల్ సోవియట్ విదేశాంగమంత్రిమాల్ టోవ్‌ను కొన్ని ప్రశ్నలడిగారు. ఈ ప్రశ్నలనూ, వాటికి మాలొటోవ్ ఇచ్చిన జవాబులనూ మాస్కో రేడియో ఈవేళ ప్రకటించింది.

ప్రశ్న : జర్మనీని స్వతంత్రరాష్ట్రం ఫెడరేషన్‌గా నిర్మించాలని అమెరికా సూచిస్తున్నది. దీనివల్ల జర్మనీ ముక్కలుముక్కలై ...

జవాబు : అందుకు ఉత్తమమార్గం, గ్రీసు అంతరంగిక విషయాల్లో విదేశాలు జోక్యం మానుకోవడమే.

ప్రశ్న : అమెరికా విధానం గ్రీసుకు శాంతి, అభివృద్ధులను చేకూర్చగలదనుకుంటారా ?

జవాబు : ఆ విషయంలో, చాలమందికి లేనట్లే, నాకూ నమ్మకంలేదు.

ప్రశ్న : ప్రస్తుత మాస్కో సమావేశంవల్ల ప్రయోజనం కలుగుతుందనుకుంటారా ? దానివల్ల నిశ్చితమైన నిర్ణయాలు తేలగలవా ?

జవాబు : ఈ సమావేశంవల్ల మిత్రరాజ్య ఆశయాలకు సాధ్యమైనంత ఎక్కువ ప్రయోజనం కలగడం మంచిది. కాని, అది ఒక్క సోవియటుమీదనే ఆధారపడిలేదు. ఏది ఎలాగున్నా, ఈ సమావేశంవల్ల సత్ఫలితాలు కలిగేలా చేయడానికి సోవియటు తన శక్తినంతటినీ వినియోగిస్తుంది.



వస్తుపరిహారం

గ్రీసు బాగుపడాలంటే ఇతరుల జోక్యం మానుకోవాలి

తెనాలితాలూకాలో ధాన్యం దొంగమార్కెటుకు పోతోంది

అవసరమైతే దౌర్జన్యంగా దాటించడానికి దొంగబల్లకు కాపలాదార్ల బందోబస్తు

తెనాలి, ఏప్రిల్ 4

లేబరుప్రభుత్వ విధానంపై లేబరుపార్టీ తిరుగుబాటు

నానాటికీ అధికతర వ్యతిరేకత

హిగిన్‌బాథమ్స్‌లో 'ప్రజాశక్తి'

— మేనేజరు.

చందాదారులకు

— మేనేజరు.



రైతు మొరలాలకించవలసిన రాజన్ తిండిదొంగ జమీందార్ల ఒడిలో

ప్రస్తుత కొట్లాటలు బ్రిటిష్ కుట్రల ఫలితమే

యూరప్‌లోని భారతీయ విద్యార్థుల తీర్మానం

బ్రిటన్‌లోని, యూరప్ దేశాల్లోని భారతీయ విద్యార్థి సంఘాల లండన్‌లో సమావేశం జరిపాయి. బ్రిటిష్ సామ్రాజ్యవాద విధానాన్ని ఖండిస్తూ ఈ సమావేశం ఒక తీర్మానం చేసింది.

"ప్రస్తుతం భారతదేశాన్ని కల్లోలం పరుస్తూన్న మతకలహాలు బ్రిటిష్ దుష్పరిపాలన పరిణామం. మత విభేదాలను అవకాశంగా తీసుకొని బ్రిటన్ ఈ కలహాలను రెచ్చగొట్టింది.

"అన్నదమ్ముల మధ్య ఈ మారణహోమాన్ని అంతమొందించడానికి తక్షణం ప్రయత్నించవలసిందని భారత నాయకులను వేడుకొంటున్నాము. అందరూ కలిసి, అందరికీ అంగీకారమైన స్వతంత్ర రాజ్యాంగ ప్రణాళికను తయారు చేయాలని కోరుతున్నాము" అని ఈ తీర్మానం తెలిపింది.

వలసదేశాల స్వాతంత్ర్యం గురించి మరొక తీర్మానం చేశారు. సామ్రాజ్యవాద ప్రభుత్వాలు తమ పెత్తనం నిలబెట్టుకోడానికి సాగిస్తున్న ప్రయత్నాలను ఈ తీర్మానం ఖండించింది. వలసదేశాలనుండి భారత సేనలను తొలగిస్తామని ఇండియా ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని అభినందించింది.

వర్ణవ్యత్యాస ప్రభుత్వాన్ని ఖండిస్తూ, ఇంకొక తీర్మానం చేశారు. దక్షిణాఫ్రికాలో తిండిలేక లక్షలకొలది ప్రజలు అవస్థ పడుతూంటే రాజాగారి సంబరానికి కోట్ల ఖర్చుపెట్టడాన్ని ఖండించింది. ఈ భాగాన్ని అక్కడున్న విద్యార్థులు వ్యతిరేకిస్తూ ఒక సవరణ పెట్టారు. ఆ సవరణ ఓడిపోయింది.

సోవియట్ యువజన ప్రతినిధులు, సైప్రస్ విద్యార్థులు, సౌహార్ద ప్రతినిధులుగా వచ్చిన వారిలో కొందరు, ఆచార్య కృపలానీ, పి. సి. జోషీగార్లు సమావేశానికి సందేశాలు పంపారు.

(2 వ పేజీ తరువాయి)

ఈ వివాదాన్ని కేవలం సిక్కులోని మత దురహంకారులలాగా "పెద్ద పాకిస్తాన్ సిద్ధించుకోవాలనే దృష్టితో చూడరాదు. కేవలం వర్గాలకు మూలమైన విభజనసే సరిదిద్దడం కోసం బ్రిటిష్ ప్రణాళికను కాంగ్రెసు నాయకులు ఎదురుకున్నట్లు అమలు జరపడానికి ఆగ్రహం చేయడం కోసం "పంజాబ్ ఒకే రాష్ట్రం" "మేమంతా పంజాబీలం" అనే నినాదంతో ఐక్యంగా ప్రతిఘటించేట్లు చెయ్యాలి.

సామాన్య ప్రజానీకం పూనుకొని నడిపే సంయుక్త కార్యక్రమం ద్వారానే పంజాబు రక్షింపబడగలదు. ఆ సామాన్య ప్రజా కార్యక్రమం అభివృద్ధి నిరోధకులైన, అంతఃకలహ ప్రేరకులైన నాయకులను బయటికి త్రోసివేయాలి. ప్రతి పార్టీలోని అభ్యుదయ వాంఛకులైన ఉత్తములతో సంయుక్త మంత్రివర్గాన్ని నిర్మించాలి. ఆ మంత్రివర్గం కార్మికులకు జీవితానికి తగిన వేతనం, రైతుకు భూమి హామీఇస్తూ ప్రజాహిత కార్యక్రమాన్ని అమలుజరపుతామని వాగ్దానం చెయ్యాలి. ఇదొక్కటే పంజాబును రక్షించగల మార్గం.

• అలాంటి పంజాబు భారతీయ రక్తప్రవంతిలో అంతర్భాగంగా ఉండాలంటే, సామ్రాజ్యవాదుల క్రీడాంగణం కాదు. భారతదేశ స్వతంత్రాన్ని సమైక్యతనుకోరే శక్తులకు బలవత్తర స్థావరంగా పంజాబు నిలబడగలదు.

• అలాంటి ముస్లిం హిందూ సిక్కుల సంయుక్త పంజాబులో, పంజాబీ భాష మాట్లాడేవారందరూ చేరతుంటారు. ఆ పంజాబుకు బ్రిటిషువారు పైనక కేంద్రాలను నిర్మించుకునేందుకు వీలుకల్గించే బందరు బందరుగా దేశాన్ని విభజించడంకోసం కాక, స్వతంత్ర సంయుక్త భారతదేశాన్ని బలపరిచేదిగా తన భవిష్యత్తును తాను నిర్ణయించుకొనేందుకు జాతీయ స్వయం నిర్ణయ హక్కు ఉంటుంది. అలాంటి సంయుక్త పంజాబ్ అపుడు అమలుజరుపగలుగుతుంది.

ఆహార సమస్యమీద గోరఖ్‌పూర్ రైల్వే కార్మికుల సమ్మె

3 వేలమంది కార్మికుల ప్రదర్శనాలు

గోరఖ్పూర్, ఏప్రియల్ 4

గోరఖ్‌పూర్‌లోని రైల్వే వర్క్‌షాపు కార్మికులు మూడువేలమంది తమకు "ఇస్తూన్న ఆహారపదార్థాలు మంచివి కావు, సరిపడటంలేదు, సకాలంలో ఇవ్వడంలేదు" అని నిరసన తెల్పుతూ నేటి ఉదయం సమ్మె ప్రారంభించారు. నగరంలో ఊరేగింపులూ, ప్రదర్శనాలూ జరిపారు. తర్వాత రైలు స్టేషనువద్ద పికెటింగు ప్రారంభించారు. ఉద్రిక్తత, వాతావరణం కూడ ఏర్పడిపోయింది.

జిల్లామాజిస్ట్రేటు, ఇతర అధికార్లు సాయుధ పోలీసు దళాలతో స్టేషన్ వద్దకు పరుగెత్తి వచ్చారు.

అధికారులు, కాంగ్రెస్‌వాదులు కార్మికులను సమ్మె మానిపించాలని చేసిన ప్రయత్నాలు విఫలమైనాయి. సమ్మె సాగుతుంది.

పల్నాడు తాలూకాలో ఆకలి యాత్ర

పిడుగురాళ్ళ మార్చి 31

ది 30—3—47 పల్నాడు తాలూకా పిడుగురాళ్ళలో శ్రీరామనవమినాడు ప్రజలు పస్తులు గడపలేక 200 మంది ఆకలియాత్ర బయలుదేరి, తమ పస్తులను గురించి అధికారులకు చెప్పుకున్నారు. దానికి అధికార్లు తాత్కాలికముగా రెండురోజులకు రేషన్ ఇచ్చారు.

పల్నాడు తాలూకా అంతటా రెండు మాసములనుండి తిండిగింజలు. రేషన్ డిపోలలో దొరకక పదులమంది తినీ తినక గడుపుతూయున్నారు. ప్రభుత్వం ఇంతవరకు యేమీ లోక్యం కలుగచేసుకోవడం లేదు. ఇతర చోట్లనుండి తిండిగింజలు తెప్పించుటలేదు. తాలూకా నల్లయి ఆఫీసర్లు సేకరించిన ధాన్యమునుకూడా ఇంతవరకు వసూలు చేయలేదు. అధికార్లు ధాన్యసేకరణకు పూనుకోక నిర్లక్ష్యంగా వుంటున్నారు. ఉదాహరణకు పిడుగురాళ్ళ ఫిర్కా బ్రాహ్మణపల్లిలో కనీసము 80 పుట్ల ధాన్యంయున్నది. టి. యస్. ఓ. ప్రొక్యూరు చేసినవి 60 బస్తాలు, రైతులు ఇచ్చినది 20 బస్తాలు. ఇటువంటి గ్రామాలు తాలూకాలో లెకలేనన్ని వున్నప్పటికీ తాలూకా అధికారులు ప్రొక్యూరు చేయడానికి ముందుకు రావటంలేదు. తాలూకా రేషనింగ్ నెంబరులో పూర్తిగా దెబ్బతినే సూచనలు కనబడుతున్నాయి. పొట్టగింజలు, సరిగెలు, కొర్రలు మొదలైనవి రూపాయకు మానెడు, ఒయ్యాలవ్వెడు అమ్ముతున్నారు. దొంగవ్యాపారస్తులు పైపరిస్థితిని తీవ్రతరం చేయుటానికి ప్రయత్నాలు చేస్తూయున్నారు.

ఈ పరిస్థితులు ప్రజలను భయకంపితుల్ని చేస్తూ వున్నాయి. ఆహారాధికార్లు వెంటనే ధాన్య సేకరణకు పూనుకొని తాలూకాను ఆహార సంక్షోభంనుండి కాపాడాలని కోరుతూ, పిడుగురాళ్ళ ఆహార కమిటీ సభ్యులు పి. ఆనందరావుగారు వ్రాస్తున్నారు.

Edited, Printed & Published by Karravoods Rajagopala Rao at the Prajasakti Press, Mogalrajapuram, Bezwada.

END OF ISSUE